

అంగన్వాడీల సమ్మె ఉధృతం

- సిఐటియు ఎఐటియుసి, ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎఐకెఎస్ మద్దతు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

అంగన్‌వాడీల సమ్మె 18వ రోజు శుక్రవారం సమ్మె చేపట్టారు. కర్నూలులో సిఐటియు, ఎఐటియుసి, ఎఫ్ఐటియు, రైతు సంఘాల నాయకులు, ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు, కాటికాపరులు కలెక్టరేట్ నుంచి ధర్నా చౌక్ వరకూ ర్యాలీగా వెళ్లి అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. ఆదోనిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరవధిక దీక్ష చేపట్టారు. మంత్రాలయంలో జగన్‌కు మంచి బుద్ధినివ్వాలని వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. పెద్దకడబూరులో ఎల్‌ఎల్‌సి కాలువలో దిగి నిరసన తెలిపారు. ఆలూరులో ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. దేవనకొండలో అంగన్‌వాడీలకు సంఘీభావంగా ప్రజా సంఘాలు, అఖిలపక్షం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. గూడూరులో భిక్షాటనతో నిరసన తెలిపారు.

సిఐటియూ నగర కార్యదర్శి సాయి బాబా, ఎఐటియుసి నగర అధ్యక్షులు వెంకటేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అంగన్వాడీలు ఆందోళనలను తీవ్రతరం చేశారు. రెండు చేతులకు తాళ్లు కట్టుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, మాజీ మంత్రి మూలింటి మారెప్ప, కర్నూలు నియోజక వర్గ టిడిపి ఇంచార్జ్ టిజి. భరత్, జనసేన జిల్లా కోఆర్డినేటర్ హర్షద్, ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు నాగేంద్ర ,చిన్న రామాంజనేయులులు దీక్షా శిబిరానికి చేరుకొని అంగన్వాడీలకు సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తే తప్ప సమ్మె విరమించేది లేదని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళ రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మునెప్ప, సిఐటియు జిల్లా కార్యదర్శి అంజిబాబులు మాట్లాడారు. జగన్ ప్రభుత్వం ఎన్నికల ముందు తెలంగాణ ప్రభుత్వం కంటే రూ.1000 అదనంగా ఇస్తానన్న హామీని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉద్యోగులకు, కార్మికులకు తీవ్ర అన్యాయం చేశాడని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని తెలిపారు. అంగన్వాడీలపై బెదిరింపు చర్యలకు పాల్పడడం ఎంతవరకు సమంజసమని అన్నారు. జగన్ ప్రభుత్వం అంగన్వాడీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సిఐటియు నగర కార్యదర్శి విజయ్ ,సుదాకరప్ప, రఫీ, ప్రభాకర్, ఎఐటియుసి నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, డిప్యూటీ కార్యదర్శి రామాంజనేయులు, కృష్ణారెడ్డి, రాము, నల్లన్న, రహేమాన్, హనుమంతు, జయరాంరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, అంగన్వాడీ వర్కర్స్ రేణుక, రుక్మిణి పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెకు కాటికాపర్ల మద్దతు

18వ రోజులుగా నిర్వహిస్తున్న అంగన్వాడీల సమ్మెకు కాటి కాపరి గుంతలు తీసే బేగరుల సంఘం ఆధ్వర్యంలో కర్నూలు ధర్నా చౌక్ వద్ద జరుగుతున్న అంగన్వాడీల సమ్మెకు సంపూర్ణ సంఘీభావాన్ని తెలిపారు.

అంగన్వాడీల సమ్మె కు ఎపిడబ్ల్యూజెఎఫ్ మద్దతు

అంగన్వాడీలసమ్మెకు ఎపిడబ్ల్యుజెఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ధర్నా చౌక్ లో సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు నగర అధ్యక్షులు శివ కుమార్ అధ్యక్షతన ర్యాలీగా వెళ్లి అంగన్వాడీల దీక్ష శిబిరంలో కూర్చున్నారు. కర్నూలు నగరకార్యదర్శి నాగేంద్ర, నాయకులు రమేష్, సీనియర్ నాయకులు చిన్న రామాంజనేయులు, జిల్లా నాయకులు ఎం.యు వినయ్ కుమార్‌లు సంఘీభావం తెలిపిన వారిలో ఉన్నారు.

గూడూరులో అంగన్వాడీల భిక్షాటన

గూడూరు: అంగన్వాడి కార్మికులు గూడూరులో 18వ రోజు సమ్మెలో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో భిక్షాటన చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు, ఇందుమతి, సుహాసిని, రాజేశ్వరి, లక్ష్మి, అనంతమ్మ, మహేశ్వరి, సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్,అంగన్వాడీ నాయకురాలు రామాంజనమ్మ, మద్దమ్మ, అన్నామని, కళావతి, ఇంతియాజ్, బి. వరలక్ష్మి పాల్గొన్నారు.



అంగన్వాడీలకు మద్దతు తెలుపుతున్న నాయకులు

ఎస్ఎస్ఎ ఉద్యోగుల మానవహారం

- జిల్లా పరిషత్ గాంధీ విగ్రహానికి వినతి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఎస్ఎస్ఎ ఉద్యోగుల రాష్ట్ర జెఎసి పిలుపుమేరకు జాతీయ నాయకులకు వినతి పత్రాలు ఇవ్వడం, మానవహారాలు పిలుపులో భాగంగా కర్నూలులో రాజవిహార్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. రాజ్‌విహార్ సెంటర్ నినాదాలతో హోరెత్తింది. అనంతరం జిల్లాపరిషత్ కార్యాలయం ఎదుట గాంధీ విగ్రహానికి సమగ్ర శిక్ష ఉద్యోగులు వినతి పత్రం సమర్పించారు. జెఎసి నాయకులు జయ నాగేశ్వరరావు, చంద్ర శేఖర్ రాజు, భాస్కర్, నాగరత్నమ్మ, సునీత, ఉమాదేవి, మళ్లీ, చిట్టెమ్మ, శాంతి మాట్లాడారు. ధర్నా చౌక్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి మాట్లాడుతూ పోరాట సమయంలో అనేక రాజకీయ పార్టీలు హామీలు ఇస్తాయని, అధికారులు వచ్చిన తర్వాత హామీలు అమలు చేయకుండా నిర్బంధాలను కొనసాగిస్తారన్నారు. అటువంటి పార్టీలను గుర్తించాలని, రాబోయే ఎన్నికల్లో పార్టీలకు బుద్ధి చెప్పాలని ఎస్-ఎస్ఎ ఉద్యోగులకు సూచించారు. మీ పోరాటానికి వామపక్ష శక్తులు అండగా ఉంటాయని హామీ ఇచ్చారు. టిడిపి కర్నూలు నియోజకవర్గ ఇన్చార్జి టిజి.భరత్, జనసేన నాయకులు హర్షవర్ధన్ మాట్లాడుతూ సరైన టైంలో ఓటు వేసి టిడిపి ప్రభుత్వాన్ని గెలిపిస్తే చంద్రబాబుతో మాట్లాడి మీ డిమాండ్లను పరిష్కరిస్తానని హామీఇచ్చారు. కేజీబీవీలో పనిచేస్తున్న టీచింగ్ నాన్ టీచింగ్ ఉద్యోగులు ఎంఆర్సిలో పనిచేస్తున్న టిఆర్‌ఎంపిఎంఐఎస్ కోఆర్డినేటర్స్ డిటిపి అకౌంటెంట్ మెసెంజర్ రమణ, వెంకట్ రాముడు, శివశంకర్, దాదాభాష, రాజారాం, కృష్ణమూర్తి, మల్లికార్జునయ్య, సుధాకర్, జైచంద్ర, షేక్‌అన్నా పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ జీతాలివ్వాలి: సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

క్లబ్ ఆటో డ్రైవర్ల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం. రాజశేఖర్ డిమాండ్ చేశారు. కర్నూలు కార్పొరేషన్ ముందు గత 12 రోజులుగా తమకు జీతాలు విడుదల చేయాలని సిఐటియు ఓల్డ్ సిటీ అధ్యక్షుడు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన సమ్మె చేస్తున్నా క్లాప్ డ్రైవర్లకు సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్, న్యూసిటీ సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు నరసింహులు సంపూర్ణ మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ గత 12 నెలలుగా జీతాలు లేక వస్తువులతో కాలం వెళ్లబుచ్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ క్లాప్ డ్రైవర్లను రెడ్డి ఏజెన్సీకి అప్పగించడం అతను పన్నెండు నెలల నుండి జీతాలు ఇవ్వకుండా నానా ఇబ్బందులకు గురి చేయడం అధికారులకు తెలిసినప్పటికీ మున్సిపల్ కమిషనర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు. జీతాలు ఇవ్వాలని ప్రశ్నించిన కార్మికులను విధుల నుంచి తొలగించడం చేస్తున్నారన్నారు. రెడ్డి ఏజెన్సీతో చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం రూ.18,500 ఒక్క నెల కూడా కార్మికులకు ఇవ్వలేదని, అదేవిధంగా వారి జీతాల నుండి కట్ చేసిన మొత్తం పిఎఫ్ అకౌంట్ లో జమ చేయలేదన్నారు. ఎమ్మెల్యేలు క్లాప్ డ్రైవర్ల సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి ఎందుకు తీసుకువెళ్లడం లేదని ప్రశ్నించారు. క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ జీతాలు ఇచ్చి ఇతర సమస్యలు పరిష్కరించే వరకు సిపిఎం వారి ఉద్యమానికి ఎప్పుడు వెన్నంటి ఉంటామని త్వరలో వారి సమస్యకు పరిష్కారం చూపకపోతే యొక్క పోరాటాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు.



మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి-గూడూరు

మున్సిపల్ కార్మికుల ఉద్యోగాల పర్మినెంట్ కోసం రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె గూడూరులో 4వ రోజుకు చేరింది. గూడూరులో సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకుడు శాంతాన్న అధ్యక్షతన మున్సిపల్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ప్రదర్శన బస్టాండులోని సమ్మె శిబిరం నుండి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. తహశీల్దార్ వెంకట రమణకు వినతిపత్రం ఇచ్చారు. సిఐటియునాయకులు జె.మోహన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు నాలుగు రోజులుగా సమ్మె చేస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రికి కనబడడం లేదా అని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికులకు రూ.లక్ష జీతంఇచ్చినా తక్కువే నని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారని, ఆ మాట కేవలం బూటకపు మాటలని ఇప్పుడు అర్థమైందన్నారు. నిజంగా మున్సిపల్ కార్మికుల పైన ముఖ్యమంత్రికి ప్రేమ ఉంటే ఆయన ఇచ్చిన హామీ ప్రకారం మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, చిత్తశుద్ధి లేదు కాబట్టే మున్సిపల్ కార్మికుల సమ్మె చేస్తున్నా కూడా ఆయన మాత్రం ఆడుదాంఆంధ్ర అని ఆటలాడుకుంటున్నాడన్నారు. పట్టణాలలో ప్రజలకు అంటురోగాలు ప్రబలకుండా ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి పట్టడం లేదన్నారు. వెంటనే మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించక పోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తారని హెచ్చరించారు. మున్సిపల్ కార్మికులు మనోహరమ, బతుకమ్మ, గ్రేసమ్మ, గోపాల్, శేఖర్, సర్యశేఖర్, శివయ్య పాల్గొన్నారు.



అర్ధనగ్న ప్రదర్శన చేపడుతున్న కార్మికులు

తగ్గిన నేరాలు...

- గతేడాదితో పోలిస్తే తగ్గుదల

- అత్యాచారాల్లో కానరాని తగ్గుదల

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి



గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది కర్నూలు జిల్లా వ్యాప్తంగా నేరాలు తగ్గాయి. 2023 నేర గణాంకాలను జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆ వివరాల మేరకు... 2022లో మొత్తం జిల్లా వ్యాప్తంగా 6,985 కేసులు నమోదు కాగా 2023లో 5,829 కేసులు నమోదయ్యాయి. 16.55 శాతం మేర కేసులు తగ్గాయి. అత్యాచార కేసుల్లో తగ్గుదల కనిపించలేదు. గతేడాది జిల్లావ్యాప్తంగా 28 కేసులు నమోదు కాగా ఈఏడాది కూడా 28 కేసులు నమోదయ్యాయి. 2022లో 39 హత్య కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఆ సంఖ్య 33కు తగ్గింది. హత్యాయత్నం కేసులు గతేడాది 86 నమోదు కాగా ఈ ఏడాది 45 కేసులు నమోదయ్యాయి. 2022లో 28 దొమ్మీ కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఆ సంఖ్య 12కు తగ్గింది. గతేడాది 5 దోపిడీ కేసులు నమోదుకాగా ఈ ఏడాది ఎలాంటి కేసులు నమోదు కాలేదు. 2022లో 14 బందిపోటు కేసులు నమోదు కాగా 2023లో 2 కేసులు మాత్రమే నమోదయ్యాయి. గతేడాది 303 దొంగతనాల కేసులు నమోదు కాగా ఈ ఏడాది 224 కేసులు నమోదయ్యియి. పగటి దొంగతనాలు 49 నుంచి 26కు, రాత్రి దొంగతనాలు 130 నుంచి 112కు తగ్గాయి. 2022లో 601 రోడ్డు ప్రమాదాలు సంభవించగా 2023లో 456 ప్రమాదాలు జరిగాయి. మహిళలపై నేరాలకు సంభందించి గతేడాది 6 వరకట్న హత్యలు నమోదు కాగా ఈ ఏడాది ఒక్క వరకట్న హత్య కేసు నమోదైంది. పోక్సో కేసులు 2022లో 44 నమోదు కాగా ఈ ఏడాది 36కు తగ్గాయి. ఎస్సీ, ఎస్టీ కేసుల్లోనూ తీవ్ర తగ్గుదల కనిపించలేదు. గతేడాది 151 ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు కాగా ఈ ఏడాది 150 కేసులు నమోదయ్యాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఒక్క శాతం మాత్రమే తగ్గాయి. 2022లో 56 సైబర్ నేరాలు నమోదు కాగా 2023లో ఆ సంఖ్య 39కు తగ్గింది.

ఇతర ముఖ్యమైన అంశాలు...

- 2023లో నాలుగు విడతలుగా లోక్ అదాలత్ నిర్వహించారు. పోలీసు శాఖకు సంభందించిన 3,935 కేసులను పరిష్కరించారు.
- బాధితులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి మొబైల్ రికవరీ మేళాలో అందజేశారు. ఇప్పటి వరకూ రూ.14.61 కోట్ల విలువైన 6,719 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించారు.
- గ్రామాలు, పట్టణాల్లో సమస్యాత్మక, ఫ్యాక్షన్ ప్రభావిత 112 ప్రదేశాలను గుర్తించి 428 సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు.
- మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌కు సంబంధించి 592 కేసులు నమోదు చేసి 1833 మందిని అరెస్టు చేశారు.
- 2023లో 292 ఐడి కేసులు, 634 ఎన్‌డిపిఎల్ కేసులు, 13 ఎన్‌డిపిఎస్ కేసులు నమోదు చేశారు.

అందువల్లే నేరాలు తగ్గుదల : ఎస్పీ

పల్లెనిద్ర, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, మహిళా పోలీస్‌లను ఇన్వాల్వ్ చేయడం, పిడి యాక్ట్ నమోదు చేయడం వల్ల ఈ ఏడాది కేసులు తగ్గాయని ఎస్పీ జి.కృష్ణకాంత్ వెల్లడించారు. నేరాలు తగ్గడానికి కృషి చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అవగాహన కార్యక్రమాల వల్లే సైబర్ కేసులు తగ్గాయన్నారు. 2024 ఎన్నికల ఏడాది నేపథ్యంలో పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. అన్ని చెక్‌పోస్టులను పటిష్టం చేస్తున్నామన్నారు. నేరాలను మరింత తగ్గించేందుకు కృషి చేస్తామన్నారు.

ముఖ్యమైన కేసుల నమోదు ఇలా...

నేరం	2022	2023
అత్యాచారాలు	28	28
హత్య	39	33
హత్యాయత్నం	86	45
దొంగతనాలు	303	224
ఎస్సీ, ఎస్టీ	151	150
వరకట్న హత్య	06	01
సైబర్ నేరాలు	56	39

అడిషనల్ ఎస్పిగా నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



కర్నూలు అడిషనల్ ఎస్పి (అడ్మిన్)గా ఎన్.నాగరాజును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హరిదాస్‌గుప్తా ఉత్తర్వులను విడుదల చేశారు. కడప జిల్లాలోని జమ్మలమడుగు డిఎస్‌పిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పై కర్నూలు జిల్లా ఎఎస్‌పిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన 1989 బ్యాచ్‌లో ఎస్ఐగా తొలిసారి నియామకమయ్యారు. కడప ప్రొద్దుటూరు మైదుకూరు చెన్నూరు కడప తాలూక, కడప టూ టౌన్ రైల్వే కోడూరు పులివెందులలో ఎస్ఐ హోదాలో బాధ్యతలు నిర్వర్తించారు. 2000 సంవత్సరంలో సిఐగా పదోన్నతి పొంది పులివెందుల, సిఐడి, ప్రొద్దుటూరు వన్ టౌన్, రైల్వే కోడూరు, తిరిగి పులివెందులలో పనిచేశారు. అనంతరం 2011లో డిఎస్‌పిగా పదోన్నతిని పొంది సిఐడి, తాడిపత్రి, కడప ఉమ్మడి జిల్లా ఎసిబి, ప్రకాశం జిల్లా దర్శిలో పని చేశారు. ప్రస్తుతం జమ్మలమడుగులో డిఎస్‌పిగా విధులు నిర్వర్తిస్తూ వచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఇటీవల 12 మంది డిఎస్‌పిలకు అడిషనల్ ఎస్‌పి లుగా పదోన్నతులు కల్పిస్తూ ఇచ్చిన ఉత్తర్వుల జాబితాలో ఈయన ఉన్నారు. ప్రస్తుతం అడిషనల్‌ఎస్‌పిగా ఉన్న సర్కార్ స్థానంలో త్వరలో నాగరాజు బాధ్యతలు స్వీకరించనున్నారు.

బాల్య వివాహాలపై అవగాన సదస్సు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు ఎస్‌ఎపి క్యాంప్ 2వ పోలీస్ పటాలంలోని కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగర పాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.వెంకటరెడ్డి అధ్యక్షతన జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం డిసిపిఒ టి.శారద ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. బాల్య వివాహ చట్టం-2006 గురించి తెలియజేస్తూ ముఖ్యంగా 18 సంవత్సరాలలోపు వివాహాలు చేయటం వల్ల శారీరక, మానసిక సమస్యలు వస్తాయన్నారు. ముఖ్యంగా ఈ బాల్య వివాహాల వలన చిన్న వయస్సులో బాలికలు గర్భవతులు అయికాన్పు సమయంలో అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పుట్టబోయే పిల్లలు కూడా తక్కువ బరువుతో పాటు మానసిక లోపంతో జన్మిస్తారన్నారు. అదేవిధంగా మాతృమరణాలతో పాటు శిశు మరణాలు సంభవిస్తున్నాయన్నారు. కర్నూలును బాల్య వివాహాలు లేని జిల్లాగా, బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. బాలబాలికలకు ఎలాంటి ఇబ్బంది కలిగినా వారి హక్కులకు ఎక్కడ ముప్పు వాటిల్లినా 0 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు బాలబాలికలు చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా డయల్ 100 కు తక్షణం ఫోన్ చేసి సమాచారం అందిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ -1098 టీమ్ మరియు జిల్లా బాలల పరిరక్షణ విభాగం వారిని రక్షించి వారికి అందాల్సిన హక్కులను అన్ని అందేలా అన్ని శాఖల సహకారంతో వారి రక్షణ సంకల్పించే బాధ్యత తీసుకుంటుందని తెలిపారు. జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ -1098 కోఆర్డినేటర్ సుంకన్న మాట్లడుతూ 0-18 సంవత్సరాల లోపు బాలబాలికలు ఎలాంటి ఆపదలో ఉన్న వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ -1098కు ఈ సమాచారం అందించాలని కోరారు. బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా, తప్పి పోయిన పిల్లలు, బాల కార్మికుల నిర్మూలన తదితర సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లా చైల్డ్‌హెల్ప్ లైన్ 1098 కోఆర్డినేటర్ డి.సుంకన్న సోషల్ వర్కర్ ఎన్.నరసింహులు శ్వేతా, రంగమ్మ , పాఠశాల ఉపాధ్యాయులు డిఆర్.గోపాల్ రెడ్డి, ఎం.సుగుణమ్మ, ఎం.హరిప్రసన్, డి. రూతమ్మ , ఎం.దేవేంద్రప్ప ఎస్. శ్రీకాంత్ ,విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డిసిపిఒ టి.శారద



డాక్టర్ స్వరూపరాణిని సన్మానిస్తున్న వైద్యులు

డాక్టర్ స్వరూపరాణి ఉద్యోగ విరమణ

సహోద్యోగుల ఘనసన్మానం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సుదీర్ఘ గవర్నమెంట్ ఉద్యోగంలో 32 సంవత్సరాలు డాక్టరుగా వివిధ పదవులలో నిజాయితీగా నిబద్ధతతో, క్రమశిక్షణతో పని చేసి రిటైర్ అవుతున్న డాక్టర్ పి.స్వరూపరాణిని కర్నూలు మెడికల్ కాలేజీ ఫార్మకాలజీ డిపార్టుమెంట్‌లో ప్రొఫెసర్ డాక్టర్ రాజేష్ అధ్వర్యంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా వారి సహ అధ్యాపకులు డాక్టర్ స్వరూపరాణి సేవలను గుర్తు చేసుకుంటూ కొనియాడారు. పిజి విద్యార్థులు వారి బోధనాపటిమను మెచ్చుకున్నారు. ఈసందర్భంగా డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ డాక్టర్ స్వరూపరాణి సేవలు భవిష్యత్తులో వినియోగించుకుంటామని చెప్పారు. డాక్టర్ స్వరూపరాణి మాట్లాడుతూ డిపార్టుమెంట్ మొత్తం ఒకకుటుంబంగా ఉండటం తనకు ఆనందాన్నిచ్చిందన్నారు. కార్యక్రమంలో పలువురు డాక్టర్లు పాల్గొని జయప్రదం చేశారు.

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతోనే మహిళ మృతి

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన టి.జి భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



బాధితులను పరామర్శిస్తున్న టిజి.భరత్

కర్నూలు మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలైందని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి టిజి.భరత్ అన్నారు. శుక్రవారం బుధవార పేటలో బహిర్భూమికి వెళ్లి లక్ష్మి (30) మృతి చెందింది. సంఘటనా స్థలానికి టిజి. భరత్ వెళ్లి పరిశీలించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మరుగుదొడ్ల ప్రాంగణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్ గుంతలో పడి మహిళ చనిపోయారన్నారు. సెప్టిక్ ట్యాంక్ మూసివేయకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. మహిళ మృతికి మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. కుటుంబ సభ్యులకు తక్షణమే రూ.20 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు. గతంలో ఇక్కడే బాలుడు చనిపోయారని.. అయినప్పటికీ అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో మరొకరి ప్రాణాలు పోయాయన్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కోవాలని ఆయన అన్నారు. నగరంలో ఉన్న పబ్లిక్ టాయిలెట్స్ వద్ద పరిశుభ్రతతో పాటు సరైన సదుపాయాలు తప్పక కల్పించాలని భరత్ కోరారు. సెప్టిక్ ట్యాంక్‌లను మూసివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, కార్పోరేటర్ విజయకుమారి, మాజీ కార్పోరేటర్లు రామాంజనేయులు, పామన్న పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అబ్దుల్లా ఎన్నిక

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కాకినాడలో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ 24వ మహాసభలలో కర్నూలు జిల్లా నుండి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎస్. అబ్దుల్లా, రాష్ట్ర కమిటీ సభ్యులుగా రంగప్పలను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సమసయల పరిష్కారానికి కోసం పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు.





నవరత్నాల పేరుతో నవమోసాలు

వైసిపి ప్రభుత్వ హామీల అమలుపై టిడిపి పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి గత 2019 ఎన్నికలకు ముందు రాష్ట్రంలో చేసిన పాదయాత్రలో ,వైసిపి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు మొత్తం 85 శాతం వరకు అమలుకు నోచుకోలేదనీ వారిచ్చిన నవరత్నాలు హామీ కాస్త వారి పుణ్యకాలంలో నవమోసాలుగా మిగిల్చారని టిడిపి ఎమ్మెల్యే, కర్నూలు అధ్యక్షులు బిటి.నాయుడు వెల్లడించారు. టిడిపి జిల్లా కార్యాలయంలో నవరత్నాలు, మేనిఫెస్టో, జగన్ రెడ్డి పాదయాత్ర హామీల అమలులో 85 శాతం ఫేయిల్ అనే పుస్తకాన్ని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు వై. నాగేశ్వరరావుయాదవ్, పి.నర్సింహులు యాదవ్, నంద్యాల నాగేంద్రకుమార్, పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నవరత్నాలు మేనిఫెస్టో హామీలు మొత్తం 199లో కేవలం 17 అమలు పర్చారని, 43 పాక్షికంగా అమలు చేశారన్నారు. అమలుకానివి 109 ఉన్నాయని తెలిపారు. పాదయాత్రలో రాష్ట్ర స్థాయి హామీలు 51 లో కేవలం 1 మాత్రమే అమలు చేశారని, 6 పాక్షికంగా అమలు చేశారని, అమలుకానివి 86 శాతం ఉన్నాయన్నారు. పాదయాత్రలో జిల్లా, నియోజకవర్గం స్థాయి హామీలు మొత్తం 480, కేవలం 3 మాత్రమే అమలుచేశారని, 5 పాక్షికంగా అమలు చేశారన్నారు. అమలు కానివి 468, 98 శాతం కాగా మొత్తం 85 శాతం హామీలను బుట్టదాకలు చేశారని వివరించారు. అందువల్లనే టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు , పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చెన్నాయుడు, పార్టీ జాతీయ ప్రదాన కార్యదర్శి నారా లోకేష్ కలిసి జగన్ పాదయాత్రలో, ఎన్నికల మేనిపెస్టోకు సంబందించిన హామీల వైఫల్యాలను ప్రజలకు తెలియజేసేందుకు రాష్ట్రస్థాయిలో పుస్తకాన్ని విడుదల చేశారని తెలిపారు. జిల్లా స్థాయిలో పార్టీ జిల్లా నాయకులతో కలిసి ఇక్కడ విడుదల చేశామని చెప్పారు.



వైసిపి హామీల వైఫల్యాలపై టిడిపి ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బిటి.నాయుడు

కర్నూలు నగరాన్ని స్మార్ట్, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు నగరాన్ని స్మార్ట్, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుతామని ఎంపీ సంజీవ్ కుమార్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ , నగర మేయర్ బివై రామయ్య, కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. 15వ ఆర్థిక సంఘం విధులు , సాధారణ నిధులతో 44వ వార్డు లోని వెంకటాద్రినగర్ పార్కును, వీధిలైట్లను, చిల్డ్రన్స్‌పార్కును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. డిప్యూటిమేయర్లు నాయకల్లుఅరుణ, సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్ రాజేశ్వర్ రెడ్డి, గోశాల చైర్మన్ ఆది మోహన్ రెడ్డి ,జిల్లా యూత్ ప్రెసిడెంట్ సితార ఇర్ఫాన్ ,భాస్కర్ రెడ్డి, లక్ష్మి పతి, శేషిరెడ్డి ,శివమోహన్ రెడ్డి మునిసిపల్ ఎఇ, డిఇ పాల్గొన్నారు.



కర్నూలులో ఆధునీకరించిన చిల్డ్రన్స్ పార్కును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

అంగన్వాడీల ఉద్యమం తీవ్రతరం

కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్ కార్మికుల సర్వీసు ఆధారంగా రెగ్యులరైజ్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, పట్టణ అధ్యక్షులు తిప్పన్న డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా ఆదోనిలోని పంప్‌హౌస్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు నవరత్నాలు వర్తింపజేయాలని కోరారు. కార్మికులు మరణిస్తే కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగం ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు యూనిఫారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాత పద్ధతిలోనే మున్సిపల్ కార్యాలయం వద్ద మస్టర్ విధానాన్ని అమలు చేయాలని, రెగ్యులర్ ఉద్యోగుల, కార్మికులకు 101 పద్ధతి కింద వేతనాలు ఇవ్వాలని కోరారు. పెండింగ్ ఉన్న వేతనాలను విడుదల చేయాలని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు హెల్త్ రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ చివరి జీతంలో సగం పింఛనుగా ఇవ్వాలని కోరారు. పర్మినెంట్ సిబ్బందికి సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకు సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలిపారు. అధ్యక్షులు కర్రెప్ప, కార్యదర్శి సోమన్న, అఫ్జల్, మూర్తి, ఈరన్న, కార్మికులు పాల్గొన్నారు.


ఆదోనిలో నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఉద్యోగులు

సుపరిపాలన అందించే నాయకుని ఎన్నుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కౌతాళం

రాష్ట్రంలో సుపరిపాలన అందించే నాయకుడు జగన్మోహన్ రెడ్డిని ఎన్నుకోవాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక సచివాలయం-3 లో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి రావడానికి టిడిపి నాయకులు ప్రజల ముందుకు వస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు న్యాయం చేయలేని టిడిపి నాయకులు, ఇప్పుడు అధికారం కోసం ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గ ప్రజలకు తమ కుటుంబం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. ఏ కష్టం వచ్చినా కూడా పరిష్కరించడానికి కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల కోసం పని చేస్తున్నామన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ మరోవైపు అభివృద్ధి పనులు ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. బాలనాగిరెడ్డి సతీమణి జయమ్మ, కుమార్తె ప్రియాంక, వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లద చారి, వైస్ ఎంపిపి బజ్జి స్వామి, సర్పంచ్ పాల్ దినకరన్, నాయకులు సుబ్బరాజు, రాఘవేంద్ర రెడ్డి, వడ్డే రాము పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

52 బసాపురం లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పరిశీలన

మంత్రాలయం : మండలంలోని 52 బసాపురం గ్రామ సమీపంలో జరుగుతున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. 52 బసాపురం గ్రామానికి తుంగభద్ర నది నుంచి రూ.20 కోట్లతో ప్రత్యేక లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసే విషయం అందరికీ తెలిసిందే. ఈ మేరకు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు పూర్తయితే ప్రతి ఎకరాకు నీరందించవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. డిఇ నాగార్జున రావు, ఎఇ సుమన్, ప్రాజెక్టు మేనేజర్ జవహార్, సైట్ ఇంజనీర్ విజయ్ కుమార్ ఉన్నారు.

'పంచాయతీల అభివృద్ధికి నిధులు సమకూర్చుకోవాలి'

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామ పంచాయతీల అభివృద్ధికి గ్రామాల్లోనే నిధులు ఎలా సమకూర్చుకోవాలో ఏపి పంచాయతీ రాజ్ అసిస్టెంట్ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం పంచాయతీ శాఖ అధికారులకు అవగాహన కల్పించారు. మండల కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ, ఇఒఆర్‌డి బాలన్న, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. ఇఒఆర్‌డి బాలన్న మాట్లాడుతూ... గ్రామాల్లో నిధులు సమకూర్చుకోవాలంటే వాటర్, ఇంటి పన్నులు, చెత్త పన్ను కాకుండా వేరే మార్గాల్లో కూడా నిధులను సమకూర్చుకోవడానికి అన్వేషించుకోవాలని ఉన్నతాధికారులు తెలుపుతున్నారని అన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల కొరత లేకుండా చూసుకునే బాధ్యత పంచాయతీ అధికారులపై ఉంటుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు సిసింద్రీ, నరేంద్ర, జయరాం నాయక్, నరసింహులు, సురేంద్ర, చండిప్రియ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఆదోని

న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీల ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం ఆదోనిలోని అంబేద్కర్ విగ్రహం ముందు అంగన్వాడీలు నిరవధిక దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, పట్టణ అధ్యక్షులు తిప్పన్న, గోపాల్, లక్ష్మన్న, మండల అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, వీరారెడ్డి, ఎఐటియుసి పట్టణ నాయకులు టి.వీరేష్, విజయ్ మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలకు పెంచాలని, పింఛను సౌకర్యం చివరి జీతంలో 50 శాతం ఇవ్వాలని కోరారు. రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని, సూపర్వైజర్ ప్రమోషన్‌కు 50 సంవత్సరాలు పెంచాలని డిమాండ్ చేశారు. సర్వీసులో చనిపోయిన అంగన్వాడీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. వేతనంతో కూడిన లీవ్ సౌకర్యం కల్పించాలని, మెనూ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, పెండింగ్ సెంటర్ అద్దెలు టిఎ బిల్లులు ఇవ్వాలని, ఫేస్ యాప్‌లను రద్దు చేయాలని కోరారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటమ్మ, ప్రాజెక్టు యూనియన్ నాయకులు వరలక్ష్మి, సరోజ, జానకి, రేణుక, పద్మ, మీనా కుమారి, రిజ్వానా, సోమక్క, జానకి, ఈరమ్మ, మరో 20 మంది నిరవధిక దీక్షలో కూర్చున్నారు. అంగన్వాడీలు సరోజ, గీత, వీరమ్మ, శారద, ఈరమ్మ పాల్గొన్నారు. **మంత్రాలయంలో** అంగన్వాడీల సమస్యలు పరిష్కరించే విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మంచి బుద్ధినివ్వాలని వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. సిఐటియు ఆధ్వర్యంలో ప్రాజెక్టు కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె 18వ రోజుకు చేరుకుంది. సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు రాఘవేంద్ర సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ఉన్న వైఎస్‌ఆర్ కాంస్య విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి హెచ్.జయరాజు, ఎఐటియుసి నాయకులు భాస్కర్ యాదవ్ మాట్లాడారు. అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షులు విశాలాక్షి, నాయకులు భీమేశ్వరి, ప్రమీల, లూసమ్మ, ఫాతిమా, ద్రాక్షాయని, సుజాత, లావణ్య, కళ్యాణి, రాధమ్మ, రంగమ్మ, రజియా, జయమ్మ పాల్గొన్నారు. **పెద్దకడబూరులో** ఎల్ఎల్‌సిలో దిగి అంగన్వాడీలు నిరసన చేపట్టారు. అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె 18వ రోజుకు చేరింది. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, సిఐటియు గౌరవాధ్యక్షులు తిక్కన్న, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సభ్యులు పరమేష్ మద్దతు తెలిపారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు జయమ్మ, చిట్టెమ్మ, శారద, సుకన్య, అరుణ, టిడిపి నాయకులు నరసన్న, ఆదాం పాల్గొన్నారు. **ఆలూరులో** 18వ రోజు సమ్మెలో భాగంగా జాతీయ రహదారిపై అంగన్వాడీలు ఒంటి కాలుపై నిలబడి, దండం పెడుతూ నిరసన తెలిపి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, అంగన్వాడీ యూనియన్ తాలూకా కార్యదర్శి జయశ్రీ మాట్లాడారు. సిఐటియు నాయకులు షాకీర్, కృష్ణ, డివైఎఫ్ఐ నాయకులు మైనా, గోవర్ధన్, అంగన్వాడీ యూనియన్ నాయకులు భారతి, బాలరంగమ్మ, లక్ష్మీ, సరస్వతి, సుజాత, ప్రభావతి, పుష్పవతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. **ఆస్పరిలో** అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెకు రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ సభ్యులు గుడిసె ఆది కృష్ణమ్మ పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్వాడీలు సమ్మె చేపట్టి 18వ రోజుకు చేరుకున్నా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం తగదన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. సిపిఎం మండల నాయకులు బాలకృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి, పట్టణ కార్యదర్శి కృష్ణమూర్తి, సిపిఐ సీనియర్ నాయకులు అంజినయ్య, బ్రహ్మయ్య, ఉరుకుందప్ప, డివైఎఫ్ఐ నాయకులు మురళీ, అంగన్వాడీ యూనియన్ నాయకులు ప్రమీలమ్మ, విజయలక్ష్మి, సరోజమ్మ, బేగం, లత, విశ్వకుమారి, ఛాయాదేవి పాల్గొన్నారు. **కౌతాళంలో** అంగన్వాడీల సమ్మె 18 రోజుకు చేరింది. అంగన్వాడీలకు కెవిపిఎస్ మద్దతు తెలిపింది. కెవిపిఎస్ ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయం నుంచి ర్యాలీగా బయల్దేరి అంబేద్కర్ విగ్రహం దగ్గర రాస్తారోకో చేపట్టారు. అనంతరం అంగన్వాడీ శిబిరం దగ్గరకు వచ్చి వారికి మద్దతు ప్రకటించారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చిన్న మారయ్య, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య, కెవిపిఎస్ నాయకులు బసవరాజు, జయరామ్, అయ్యప్ప, తాయప్ప, ప్రకాష్, ఆదాం పాల్గొన్నారు. **ఎమ్మిగనూరులో** ధర్నా నిర్వహించి, ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు, ఎఐటియుసి నాయకులు తిమ్మగురుడు పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి బి.గోవర్ధనమ్మ నాయకత్వం వహించారు. అంగన్వాడీలు రాగమ్మ, శంషాద్ భాను, శైలజ, తులసి, పార్వతి, బండ లత, జయమ్మ, సుమిత్ర, మేరీ, గౌసియా, సునీత, గ్రేసమ్మ పాల్గొన్నారు.


ఆదోనిలో నిరవధిక దీక్షకు కూర్చున్న అంగన్వాడీలు

మంత్రాలయంలో



పెద్దకడబూరు ఎల్ఎల్‌సిలో దిగి నిరసన చేపడుతున్న అంగన్వాడీలు


ఆస్పరిలో మాట్లాడుతున్న గుడిసె ఆది కృష్ణమ్మ



కౌతాళంలో మద్దతు తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు

ఎమ్మిగనూరు వైసిపి అభ్యర్థిగా మాచాని వెంకటేష్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు అసెంబ్లీ వైసిపి అభ్యర్థిగా మాచాని వెంకటేష్‌ను అధిష్టానం ఎంపిక చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఎమ్మిగనూరు అసెంబ్లీ స్థానాన్ని బీసీల కేటాయించాలని భావిస్తున్నట్లు గత వారం రోజులుగా అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. మాజీ ఎంపీ బుట్టా రేణుక, వీరశైవ లింగాయత్ ఛైర్మన్ వై.రుద్ర గౌడ్, ఎంపీ సంజీవ్ కుమార్, ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మధ్య పోటాపోటీగా సీటు కోసం ప్రయత్నాలు సాగాయి. అధిష్టానం బీసీకి మాత్రమే ఇస్తామనడంతో ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి తన తరఫున మాచాని నాగరాజు కుమారుడు మాచాని వెంకటేష్‌ను ప్రపోజ్ చేయడంతో అధిష్టానం అంగీకరించినట్లు తెలిసింది. మాచాని వెంకటేష్ డిప్లొమా సివిల్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పట్టణంలో సుపరిచితుడు.



ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు దారుణం

- దాడిపై పోలీసులకు ఫిర్యాదు - సచివాలయం ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేయడం దారుణమని సచివాలయం ఉద్యోగుల సంఘం నాయకులు ఆంజనేయులు, వన్నూరప్ప, ఉరుకుందు తెలిపారు. ఈనెల 28న పట్టణంలోని వడ్డే వీధిలో కుళాయి కనెక్షన్ ఇవ్వడానికి వెళ్లిన సచివాలయ సిబ్బంది రాజు, శివపై నవాజ్ అనే వ్యక్తి దాడి చేశారని చెప్పారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. సచివాలయ ఉద్యోగులు లక్ష్మన్న, సుభాష్, నామితుల్లా, శిరీష, షాజహాన్, వీరేష్ పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

కెవిపిఎస్ ఖండన : ప్రభుత్వ ఉద్యోగులపై దాడులను కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం ఖండించారు. సచివాలయ ఉద్యోగులు రాజు, శివపై దాడులు చేసిన నవాజ్‌ను శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అంగన్వాడీలకు కనీస వేతనాలివ్వాలి

- ప్రభుత్వ వేధింపులు ఆపాలి
- అంగన్వాడీల సమ్మెకు అఖిలపక్షం, ప్రజాసంఘాల మద్దతు

ప్రజాశక్తి - దేవనకొండ

అంగన్వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలని, వారిపై ప్రభుత్వ వేధింపులు ఆపాలని అఖిలపక్ష నాయకులు వీరశేఖర్, నరసారావు, సుధాకర్, రాజా సాబ్, జ్యోతి డిమాండ్ చేశారు. శుక్రవారం దేవనకొండలోని వెంకటేశ్వర స్వామి గుడి ఆవరణలో సిఐటియు ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో అంగన్వాడీల సమ్మెకు సంఘీభావంగా రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి అశోక్ అధ్యక్షత వహించారు. సిపిఎం, సిపిఐ, టిడిపి, కాంగ్రెస్, ఎంఆర్‌పిఎస్, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు అంగన్వాడీల సమ్మెకు సంపూర్ణ సంఘీభావం ప్రకటించాయి. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడారు. పెరుగుతున్న ధరలు, అవసరాలకు అనుగుణంగా అంగన్వాడీల వేతనాలు పెంచాలని కోరారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిస్తోందని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం రూ.1000 మాత్రమే వేతనాలు పెంచిందని పేర్కొన్నారు. దేశంలోని మిగతా రాష్ట్రాల కంటే వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత అంగన్వాడీలకు ఎక్కువ వేతనం ఇస్తామన్న జగన్మోహన్ రెడ్డి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మొండి చేయి చూపారని విమర్శించారు. రిటైర్మెంట్ తర్వాత ఖాళీ చేతులతో ఇంటికి వెళితే కుటుంబ సభ్యుల నుంచి నిరాదరణకు గురవుతున్నారని తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, పింఛను సౌకర్యం కల్పించాలని అంగన్వాడీలు కోరుతున్నారని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్నా విద్యార్హతకు తగ్గట్టు ప్రమోషన్లు ఇవ్వమంటే ప్రభుత్వం మీనమేషాలు లెక్కబెడుతోందని విమర్శించారు. యాప్‌ల పేరుతో, రాజకీయ వేధింపులు అంగన్వాడీలకు నిత్య కృత్యమయ్యాయని పేర్కొన్నారు. సమ్మె తీవ్రతరమైతే గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, శిశువులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. రైతుసంఘం, వ్యకాస, యువజన సంఘాల నాయకులు సూరి, యూసుఫ్, శ్రీనివాసులు, అంగన్వాడీలు మాబు, వెంకటలక్ష్మి, ఎర్రమ్మ, మంజుల, సరోజ, జానకి, లక్ష్మీ, భార్గవి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వీరశేఖర్

పోలింగ్ కేంద్రాల్లో ఎఒ పరిశీలన

ప్రజాశక్తి - నందవరం

ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది ఆయా గ్రామాల్లో ఎన్నికల అధికారులు పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్నారు. శుక్రవారం మండలంలోని నాగలదిన్నె, మిట్టసోమాపురం, గురజాల, రాయచోటి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎఒ స్రవంతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏయే సమస్యలున్నాయి, ఏ సౌకర్యాలు కల్పించాలని పరిశీలించినట్లు తెలిపారు. నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు తయారు చేసి పంపిస్తామని చెప్పారు. ఆయా గ్రామాల్లోని బూత్‌ల వారీగా నివేదికలు సిద్ధం చేసి జిల్లా అధికారులకు పంపుతున్నామన్నారు. సమస్యలుంటే ప్రజలు తెలియజేస్తే వాటిని జిల్లా అధికారులకు నివేదిక రూపంలో పంపిస్తామని తెలిపారు. ఎఎస్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు దిక్సూచి.. యుటిఎఫ్ డైరీ

- యుటిఎఫ్ నూతన డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఉపాధ్యాయులకు యుటిఎఫ్ డైరీ, జిఒ పుస్తకం దిక్సూచిలా ఉపయోగపడుతుందని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నరసింహులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.మద్దిలేటి, చంద్రపాల్ తెలిపారు. శుక్రవారం గోనెగండ్ల మండల విద్యావనరుల కేంద్రం దగ్గర 2024 సంవత్సరానికి సంబంధించిన యుటిఎఫ్ నూతన డైరీ, అధ్యాపక దర్శినిని ముఖ్య అతిథులు ఎంఇఒలు జి.రామాంజనేయులు, ఎం.నీలకంఠలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యుటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఓ వైపు పోరాడుతూనే, మరో వైపు విద్యారంగ పరిరక్షణకు, పదో తరగతి విద్యార్థుల కోసం మోడల్ పేపర్లు రూపొందించి అతి తక్కువ ఖర్చుకే అందజేస్తోందని తెలిపారు. యుటిఎఫ్ రూపొందించిన డైరీ ఉపాధ్యాయులతో పాటు, ఉద్యోగ వర్గాలందరికీ ఎంతో ఉపయుక్తంగా ఉందన్నారు. సెలవు నిబంధనలు, సర్వీస్ విషయాలతో పాటు ముఖ్యమైన ప్రభుత్వ ఉత్తర్వులు అన్నింటిని డైరీతో పాటు అనుబంధ పుస్తకంగా అధ్యాపక దర్శిని ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం యుటిఎఫ్ ఎప్పుడూ తన వంతు పాత్రను పోషిస్తోందని చెప్పారు. యుటిఎఫ్ నాయకులు నీలకంఠ, కేశవులు, సలోమి, పద్మ, అక్బర్, నాగేశ్వర రావు, ఖాజన్న, బాబు, హుస్సేని, రవి, వెంకటేశ్వర రెడ్డి, అబ్దుల్ సలీమ్, నాగరాజు, మద్దిలేటి, సోమనాథ్, లక్ష్మణ్, లక్ష్మీమూర్తి, అనిత, షెహనాజ్, కాశమ్మ, రహమత్ బీ, సాయితేజ, దిలీప్ రెడ్డి, ఉమా, శ్రీనివాసులు, వరప్రసాద్, పుష్పరాజ్ పాల్గొన్నారు.

కౌతాళం : యుటిఎఫ్ ఆధ్వర్యంలో 2024 నూతన డైరీ, క్యాలెండర్‌ను ఎంఇఒ శోభారాణి శుక్రవారం ఆవిష్కరించారు. ఎరిగేరి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు, సీనియర్ నాయకులు కృష్ణమూర్తి నూతన డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జీవిత, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడారు. యుటిఎఫ్ అన్ని కేడర్ల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ డైరీలో ఉపాధ్యాయుల సర్వీసుకు సంబంధించిన, పిఆర్‌సికి సంబంధించిన జిఒలు, ఉపాధ్యాయుల సెలవు నిబంధనలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లారెడ్డి, ఓంకార్, ఆర్థిక కార్యదర్శి బసవరాజు, సీనియర్ నాయకులు బసప్ప, బాలాజీ రావు, నాయకులు సుధాకర్, రంగన్న, సుధాకర్ నాయక్, రామాంజనేయులు, ఈరన్న, రామకృష్ణుడు, అబ్దుల్ రహీం, రాము, రంగారెడ్డి, సుధాకర్, నారాయణ, మహిళ నాయకులు వీరశ్రీ, సంధ్య జ్యోతి, విజయలక్ష్మి, పర్వీన్, సుధారాణి, నాగేంద్రమ్మ, విమల పాల్గొన్నారు.



గోనెగండ్లలో డైరీ ఆవిష్కరిస్తున్న ఎంఇఒ



కౌతాళంలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రభుత్వ నిధులతో సొంతింటికి సిసి రోడ్డు...

- ఆగ్రహించిన దళితులు...
- తెలియదంటున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-హాలహర్వి

హాలహర్విలోని అధికార పార్టీకి చెందిన మండల కన్వీనర్ దళిత కాలనీకి వేయాల్సిన సిసి రోడ్డును నిర్మాణంలో ఉన్న తన ఇంటికి వేసుకున్నారని శుక్రవారం దళితులు ఆగ్రహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సిసి రోడ్డు నిర్మాణం కోసం రూ.60 లక్షలు ఎన్ఆర్ఈజిఎస్ కింద జులైలో విడుదలయ్యాయి. హాలహర్విలోని దళిత కాలనీలో వేయాల్సిన రోడ్డును అధికార బలంతో నివాస గృహాలు లేకపోయినా నిర్మాణంలో ఉన్న మండల కన్వీనర్ ఇంటికి రూ.2 లక్షలతో సిసి రోడ్డు వేశారని దళిత కాలనీ వాసులు మండల కన్వీనర్ భీమప్ప చౌదరిపై ఆగ్రహించారు. ఈ విషయంపై ఎంపిడిఒ ఆంథోనిని కాలని వాసులు అడగగా తనకేమీ తెలియదని, తనకు సంబంధం లేదని సమాధానం ఇచ్చారు. పిఆర్ ఎఇ వెంకటేశ్వర్లును అడగగా మంత్రి ఆదేశాలతో వేశామని తెలిపారు.



కటికె వృత్తిదారుల సమస్యలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తాం

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జి గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

కటికె వృత్తిదారుల సమస్యలను టిడిపి అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. శుక్రవారం ఆదోనిలోని కుమ్మర వీధి ఇన్‌ఛార్జీ, ఆర్ఎంపి, టిడిపి సీనియర్ నాయకులు మహబూబ్ బాష నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పట్టణంలో మటన్ షాపులు పెట్టుకున్న చాలా మంది నిరుపేదలు ఉన్నారన్నారు. టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టి.రామారావు కటికె సంఘానికి జిల్లాలో కమ్యూనిటీ హాలు నిర్మించారని తెలిపారు. ఒకటి ఎమ్మిగనూరు, రెండోది నంద్యాల పట్టణంలో నిర్మించారన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే కటికె సంఘం నాయకుల విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీ హాలు కోసం కృషి చేస్తామని తెలిపారు. నిరుపేదలకు పక్కా ఇల్లు మంజూరు చేస్తామని, అర్హులైన పేదవారికి పింఛన్లు అందిస్తామని చెప్పారు. సమస్యలను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాబోయే కాలంలో టిడిపి తరఫున ఉన్నత పదవులు వస్తాయన్నారు. కలిసికట్టుగా టిడిపి జెండా ఎగుర వేయాలని కోరారు. ముస్లిం, మైనార్టీ సమస్యలను టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, వడ్డేమాన్ గోపాల్, మాజీ ఎంపిపి మురళీ, ముస్లిం, మైనార్టీ పట్టణ నాయకులు సయ్యద్ వాసిం ఖాద్రి, లక్ష్మి రెడ్డి, భరత్ కుమార్, పరమేష్, సైనుల్లా, అల్తాఫ్, చార్కా, జిలాన్, జుమ్మా, పెట్ సిరాజ్, సంగరం జాకీర్, హోటల్ హైమద్ పటేల్, సద్దాం, షేక్ అబ్జల్ పాల్గొన్నారు.


గుడిసె ఆది కృష్ణమ్మను సన్మానిస్తున్న నాయకులు

డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని ఎల్‌బి నగర్ వీధిలో నెలకొన్న డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని జనసేన నాయకులు శ్యామ్, అయ్యప్పన్, ప్రకాష్, వీరేష్, కైసర్ బాష, రాము, గోవిందు, వీరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదోనిలోని ఎల్‌బి నగర్ ప్రాంతాన్ని పరిశీలించి ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జనసేన పార్టీ చేపట్టిన హెల్ప్ లైన్ నెంబర్ 7799666851కు స్థానికులు సమాచారం అందించారని తెలిపారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. చెత్త పన్నును పింఛనులో కట్ చేస్తున్నారని తెలిపారు. టిజిఎల్ కాలనీ సచివాలయ కార్యాలయంలో విచారిస్తే ముగ్గురు లీవ్ పెట్టారని చెబుతున్నారన్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీ సమస్యలపై చర్యలు తీసుకోవాలని కోరారు.


'డయాగ్నోస్టిక్ సెంటర్' శుభ పరిణామం

- టిటిడి పాలకమండలి సభ్యులు సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో డయాగ్నోస్టిక్ సెంటర్ అందుబాటులోకి రావడం ప్రజలకు శుభ పరిణామమని టిటిడి పాలకమండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన బాంధవ్య డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు అనారోగ్య పరిస్థితులు ఏర్పడితే పరీక్షలకు ఎమ్మిగనూరు లేదా ఆదోని, కర్నూలు వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని తెలిపారు. ప్రస్తుతం డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు వల్ల ప్రజలకు సమయం వృథా కాకుండా తక్కువ ఖర్చుతో పరీక్షలు చేయించుకోవచ్చని పేర్కొన్నారు. డయాగ్నోస్టిక్ సెంటర్ ఇన్‌ఛార్జి కిషన్ రావు (గోర్కల్ కృష్ణస్వామి), కె.మల్లికార్జున మాట్లాడుతూ... పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆశీస్సులతో, రాంపురం రెడ్డి సోదరుల సహకారంతో ఈ డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెంటర్‌కు రాలేని వారు 6305328844 నెంబర్‌కు ఫోన్ చేస్తే వారి ఇంటి వద్దకొచ్చి రక్త సేకరణతో పరీక్షలు నిర్వహించి రిపోర్టును తెలపగలరని సూచించారు. డాక్టర్ వినయ్ ఎంబిబిఎస్, ఎండిఆర్‌డి, డాక్టర్ జి.మధుసూదన్ ఎంబిబిఎస్, ఎండి పతోలజీ సారథ్యంలో స్మార్ట్ ఫుల్ బాడీ చెకప్ పేరుతో ఆఫర్ ద్వారా రూ.1500 ఖరీదు గల పరీక్షలను కేవలం రూ.399లకు, ఫేవర్ ప్రొఫైల్ చెకప్ పేరుతో రూ.1100 ఖరీదు గల పరీక్షలను కేవలం రూ.349లకు, రూ.500 ఖరీదు గల థైరాయిడ్ టి3, టి4, టిఎస్‌హెచ్ వంటి పరీక్షలు కేవలం రూ.199లకే చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశం కేవలం కొద్దిరోజులు మాత్రమే ఉంటుందని చెప్పారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు భక్తులు ఉపయోగించుకోవాలని కోరారు. వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి జి.వెంకటేష్, నాయకులు జనార్ధన్ రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.


సెంటర్‌ను ప్రారంభిస్తున్న సీతారామిరెడ్డి





లబ్ధిదారులకు చెక్కు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్, జడ్పి చైర్మన్

కళలను ప్రోత్సహించాలి

- బాలోత్సవంలో వక్తలు
- విజయవంతంగా ముగిసిన నంది బాలోత్సవాలు

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

రెండు రోజుల పాటు ఉత్సాహంగా సాగిన నంది బాలోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. శుక్రవారం నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్‌లో నంది బాలోత్సవ కమిటీ ఉపాధ్యక్షులు డి.క్రాంతికుమార్ అధ్యక్షతన నిర్వహించిన బాలోత్సవల్లో మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్, ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు రాకేష్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది రామచంద్ర రావు ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ సాంప్రదాయ కళలతో పాటు రాయలసీమ ప్రాంత కళలను ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుత కార్పొరేట్ ప్రపంచంలో మరుగున పడిపోతున్న జానపదం పద్యాలు, జానపద నృత్యాలు, మన సాంప్రదాయ కళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పోటీలు, క్రీడలు, వంటి సాంస్కృతిక కార్యక్రమాలకు పాలకులు ప్రాధాన్యత నివాలన్నారు. పౌష్టిక ఆహార లోపంతో రక్తహీనత, బరువు తక్కువ పిల్లలు ఉంటున్నారన్నారు. పిల్లలలో ఆరోగ్యం పట్ల ప్రభుత్వాలు దష్టి సారించాలన్నారు. నేటి సమాజంలో పిల్లలు సెల్ ఫోన్‌లకు బాగా అలవాటు పడిపోయారని, ఈ తరుణంలో వారికి ఇలాంటి సాంస్కృతిక పోటీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నందిబాలోత్సవాల పేరుతో పిల్లలలో ఉల్లాసాన్ని కల్పించేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. వైద్యులు రాకేష్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడం కోసం బాలోత్సవం పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పిల్లలు ఎంత ఉత్సాహంగా పాల్గొంటారన్నారు. ప్రముఖ న్యాయవాది రామచంద్రరావు మాట్లాడుతూ పిల్లలు ఆటపాటల్లో పాల్గొనడం ద్వారా వారిలో మానసిక ఉల్లాసం, ఉత్సాహం పెరగడంతో పాటు వారు చదువు పైన ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. నేటికీ చాలా పాఠశాలల్లో సరైన విధానాలు కూడా లేవని, కేవలం కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులకే యాజమాన్యాలు ఖర్చు పెట్టి కార్యక్రమాలను వస్తుంటారని, నంది బాలోత్సవం పేరుతో సాధారణ పేద మధ్యతరగతి గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ఒక వేదిక పైన అనేక రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం అమరావతి బాలోత్సవం కార్యదర్శి యువి రామ రాజు, కర్నూలు బాలోత్సవం కార్యదర్శి జెన్.శేషయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థినీ విద్యార్థుల సృజనాత్మకతను పెంచడానికి అన్ని రంగాలలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో బాలోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ నిర్వహిస్తున్న నంది బాలోత్సవ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. జరుగుతున్న రెండు రోజుల పిల్లల పండగలో వేలాదిమంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొంటున్నారని విశేష స్పందన వచ్చిందన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రత్యేక బాలోత్సవాలు జరపాలన్నారు. నంది బాలోత్సవం ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి జి. నగేష్ మాట్లాడుతూ నంది బాలోత్సవాల్లో దాదాపు 3000 వేల మంది విద్యార్థులు పాల్గొన్నరన్నారు. రెండు రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో కోలాటం, శాస్త్రీయన నృత్యం, అకాడమిక్ కార్యక్రమాలు, తెలుగులో మాట్లాడటం, వేషాధారణ,మట్టి బొమ్మలు, జానపద కళలు, క్విజ్, వ్యాస రచన పోటీలతో పాటు దాదాపు 39 రకాల కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమం అనంతరం సీనియర్స్, సబ్ జూనియర్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిధులు మెమొంటోలను ప్రధానం చేశారు. కార్యక్రమంలో నంది బాలోత్సవ ఆహ్వాన సంఘం గౌరవ సలహా దారులు బి.రామరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.మౌలాలి, సభ్యులు కిరణ్, కిషోర్, భాస్కర్, జానవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నాగరాజు, మాణిక్యం శెట్టి, నాయకులు గోపాల్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, సుధాకర్, నంది బాలోత్సవం సభ్యులు నరసింహ, బాలవెంకటే, శివ, సిద్దు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్ఎండి ఫరూక్

30,199 మంది విద్యార్థులకు

జగనన్న విద్యా దీవెన

- 27,504 మంది తల్లుల ఖాతాల్లో రూ. 21.36 కోట్లు జమ : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా 2023 జూలై నుండి సెప్టెంబరు 2023 త్రైమాసికానికి సంబంధించి 4వ విడతలో 30,199 మంది విద్యార్థులకు సంబంధించి 27,504 మంది తల్లుల ఖాతాల్లో రు. 21.36 కోట్లు జమ చేశామని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సామూన్ పేర్కొన్నారు. జగనన్న విద్యా దీవెన ద్వారా రాష్ట్రంలోని 8.09 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ రూ.584 కోట్లను ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన బహిరంగ సభ నుండి బటన్ నొక్కి నేరుగా అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసారు. ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలానీ సామూన్, ఉమ్మడి జిల్లా జిల్లాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఏపిఎస్పిడిసిఎల్ డైరక్టర్ శశికళ రెడ్డి, దృశ్య కళ డైరక్టర్ సునీత అమృత రాజ్, బిసి సంక్షేమ అధికారి లక్ష్మీదేవి,సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జూలై 2023 నుండి సెప్టెంబరు 2023 త్రైమాసాల 4వ విడత జగనన్న విద్యా దీవెన కింద 30,199 మంది విద్యార్థులకు సంబంధించి 27,504మంది తల్లుల ఖాతాల్లో రూ. 21.36 కోట్లు నేరుగా జమచేశామన్నారు. జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 5,167 మంది విద్యార్థుల తల్లులకు రూ.3.66 కోట్లు, బనగానపల్లిలో 5,332 మంది విద్యార్థుల తల్లులకు రూ.3.74 కోట్లు, డోన్ లో 4,264 మంది విద్యార్థుల తల్లులకు రూ.2.92 కోట్లు, నందికొట్కూర్‌లో 4,673 మంది విద్యార్థుల తల్లులకు రూ.3.20 కోట్లు, నంద్యాలలో 5,213 మంది విద్యార్థుల తల్లులకు రూ.4.03 కోట్లు, పాణ్యంలో 1,552 మంది విద్యార్థుల తల్లులకు రూ.1.09 కోట్లు, శ్రీశైలంలో 3,998 మంది విద్యార్థుల తల్లులకు రూ.2.68 కోట్లు జమ చేశామని కలెక్టర్ వివరించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని పేద విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలన్నారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థి ఉన్నత చదువులకు దూరం కాకూడదు, చదువుల ఖర్చుతో తల్లిదండ్రులు అప్పులపాలు కాకూడదన్న లక్ష్యంతో జగనన్న విద్యాదీవెన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్, ఏపిఎస్పిడిసిఎల్ డైరక్టర్, దృశ్య కళ డైరక్టర్ తదితరుల చేతుల మీదుగా విద్యార్థులు, విద్యార్థుల తల్లులకు చెక్కును అందజేశారు.

సమాజ సేవలో.. అంగన్వాడీలు మరో మదర్ థెరిస్సాలు

ప్రజాశక్తి - విలేకరులు

నిరవధిక సమ్మెలో భాగంగా అంగన్వాడీలు 18వ రోజు వివిధ రూపాలలో నిరసన తెలిపారు. శుక్రవారం పలు ప్రజా సంఘాల నాయకులు నాయకులు అంగన్వాడీలకు మద్దతు తెలిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాని కోరారు.

నంద్యాల రూరల్: అంగన్వాడీలు సమాజ సేవలో మదర్ థెరిస్సా ప్రతిరూపంగా ఉన్నారని అటువంటివారికి కంట కన్నీరు పెట్టిస్తే ఎవరికైనా పతనం తప్పదని ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు శివ, జగన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా 18వ రోజు ఎపిడబ్ల్యూ జెయఫ్ నాయకులు సభ్యులు అంగన్వాడీలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యూజెయఫ్ నాయకులు మాట్లాడారు. అంగన్వాడీల న్యాయమైన పోరాటానికి ఏపీడబ్ల్యూజేఎఫ్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. **నంద్యాల కలెక్టరేట్:** అంగన్వాడీలు నంద్యాలలో బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా ఉన్న టెంట్ నుండి విశ్వనగర్ సాయిబాబా నగర్ మీదుగా ర్యాలీ చేరుకుని సాయిబాబా నగర్ జంక్షన్‌లో అరగంట పాటు మానవహారం నిర్వహించారు. వైయస్సార్ విగ్రహం ముందు కళ్ళు, చెవులు, నోరు మూసుకుని రాజన్న రాజ్యం అంటే ఇదేనా అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎంపీ ఇంటి దగ్గరికి వెళ్లి గంటపాటు ధర్నా చేసి అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి లేకపోవడంతో ఇంటికి వినతిపత్రం అతికించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, కే మహమ్మద్ గౌస్, కర్నూలు జిల్లా కార్యదర్శి గోపాల్‌లతోపాటు అంగన్వావాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం. నిర్మల, ప్రాజెక్టు కార్యదర్శి సునీత, జిల్లా నాయకురాలు నాగరాణిలతోపాటు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు 300 మంది పాల్గొన్నారు. **మహానంది :** తహసిల్దార్ కార్యాలయం అంగన్వాడీలు నిరవధిక సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా వారు గాడిదకు వినతి పత్రం అందజేసి నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ 18 రోజులుగా రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి కనీసం చలనం లేదన్నారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, లేకపోతే సమస్యల పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సావిత్రి, నారాయణమ్మ, జ్యోతి ఉషారాణి, గౌరీ,చండీ దేవి, మహేశ్వరి, పుష్పకళ, లక్ష్మి, ఖైరున్ , కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

మిగతా 6వ పేజీలో...



నంద్యాల కలెక్టరేట్ : ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి ఇంటిని ముట్టడించిన అంగన్వాడీలు



మహానంది : గాడిదకు వినతి పత్రం అందజేసి నిరసన తెలిపిన అంగన్వాడి కార్యకర్తలు

ఉరితాళ్ళతో మున్సిపల్ కార్మికుల నిరసన

నాలుగవ రోజుకు చేరిన సమ్మె

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికులందరికీ వర్తింపచేయాలని, జీవో నెంబర్ 7 ప్రకారం స్కిల్డ్, సెమి స్కిల్డ్ వేతనాలు అర్హులైన కార్మికులకు ఇవ్వాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా 4 రోజులుగా జరుగుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి హామీలను అమలు చేయకుండా మాటలు చెబుతూ, ప్రగల్భాలు పలుకుతూ కార్మికుల ందరికీ మాటలు చెబుతూ గొప్పలుగా పొగుడుతూ కార్మికులను అంధకారంలో నెడుతున్నాడని ఈ ప్రభుత్వ పాలనలో చావేగతి అంటూ మెడకు ఉరితాళ్ళు వేసుకుని మూకుమ్మడిగా వినూత్నంగా నిరసన తెలిపారు.

ఈ కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షులు కష్ణయ్య అధ్యక్షత వహించగా కార్యదర్శి భాస్కరాచారి నాయకులు రామకృష్ణ, ఆదాము, రామాంజనేయులు, నాగేశ్వరరావు, సిద్దయ్యలతోపాటు మున్సిపల్ కార్మికులు 200 మంది పాల్గొన్నారు. అనంతరం సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, కే. మహమ్మద్ గౌస్, సిఐటియు కర్నూలు జిల్లా కార్యదర్శి గోపాల్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అసెంబ్లీలో చెప్పిన మాటలను నెరవేర్చాలని, స్కిల్డ్, సెమి స్కిల్డ్, వేతనాలను జీవో నెంబర్ 7 ప్రకారం అర్హులైన వారందరికీ ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికుల ందరికీ వర్తింపచేయాలని, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, అన్ని డిమా ండ్ల సాధనకు ప్రభుత్వం ముందుకు రావాలని లేకుంటే నిరవధిక సమ్మె ఉధృతం చేస్తామన్నారు.

మిగతా 6వ పేజీలో...



నంద్యాల కలెక్టరేట్ : ఉరితాళ్ళతో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

నేడు నంద్యాలలో సామాజిక సాధికార యాత్ర

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వైసిపి ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన సామాజిక సాధికార బస్సు యాత్ర శనివారం నంద్యాల రానుంది. నంద్యాల గాంధీ చౌక్ నందు సాయంత్రం 3 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి నంద్యాల నియోజకవర్గం ప్రజలు ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి కోరారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రజా సంక్షేమమే వైకాపా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉయ్యాలవాడ మండలం సర్వాయిపల్లె గ్రామంలో గడప గడపకు తిరుగుతూ అర్హులకు అందిన సంక్షేమ పథకాల గురించి ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **బాధిత కుంటుంబాన్ని పరామర్శ :** మండలంలోని చింతకొమ్మదిన్నె వద్ద బుధవారం జరిగిన యాక్సిడెంట్లో దంపతులు చనిపోవడంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. పెద్ద చింత కుంట గ్రామానికి చెందిన దంపతులు పల్లే లక్ష్మి నరసింహుడు,నరసమ్మ కుటుంబీకులకు ఎమ్మెల్యే శుక్రవారం వారింటికెళ్ళి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

విద్యుద్ఘాతంతో పశుగ్రాసం దగ్ధం

ప్రజాశక్తి - పగిడ్యాల

ట్రాక్టర్ పై పశుగ్రాసాని తరలిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి దక్కమైన సంఘటన పగిడ్యాల మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. పగిడ్యాల గ్రామానికి చెందిన సుధాకర్ గౌడ్ తన పొలంలో నుంచి కల్లానికి పశుగ్రాసాన్ని తరలిస్తుండగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపాన విద్యుత్ తీగలు తగిలి దగ్ధమైంది. విషయం తెలుసుకున్న సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న హుటాహుటిన స్థానికులను కూడగట్టి ట్రాక్టర్‌తో ట్యాంకర్ ద్వారా నీటిని తరలించి మంటలు ఆర్పించారు.

ప్రజల నడ్డి విరుస్తున్న ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

వైసిపి ప్రభుత్వం విపరీతంగా కరెంటు బిల్లులను పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం మండలంలోని కైప గ్రామంలో బాబు షఉరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ, వైసిపి వైఫల్యాలను ఎండగట్టారు. ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బీసీ మాట్లాడుతూ కరెంట్ బిల్లులు విపరీతంగా పెంచి వైసీపీ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందని ఆరోపించారు. కైప గ్రామ పంచాయతీలో 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రూ. 407 లక్షలతో అభివృద్ధి చేసినట్టు వివరించారు. రూ. 105 లక్షల రైతు రుణమాఫీ, 16 లక్షల పొదుపు రుణమాఫీ చేసామని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో 2014 నుంచి 2019 వరకు రూ. 130 లక్షల రూపాయలతో సీసీ రోడ్స్ వేస్తే, వైసీపీ ప్రభుత్వం గడిచిన నలుగున్నేళ్లలో కేవలం 10 లక్షల రూపాయలతో మాత్రమే సీసీ రోడలు వేసినట్లు తెలిపారు. వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. టిడిపి అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సంక్షేమం సాధ్యమని తెలిపారు. వచ్చే ఎన్ని కల్లో తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ముదుళ్ల రఘునాథ్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, అక్బర్ బాషా, నజీర్, ప్రసాద్, హుస్సేన్, శేఖర్ రెడ్డి, పకూర్ బాషా, జనసేన నాయకులు భాస్కర్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



భవిష్యత్తు గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

టిడిపితోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు
- భూమా జగత్‌విఖ్యాత్ రెడ్డి

ఆళ్లగడ్డ: టిడిపి తోనే అభివద్ధి సంక్షేమ పథకాలు సాధ్యమని తాలుకా టిడిపి యువ నాయకులు భూమా జగత్‌విఖ్యాత్ రెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని విద్యానగర్ , సాగర్ వీధి, ఏసునాధపురం తదితర కాలనీ లలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను వివరించి అనంతరం ఇంటింటికి తిరుగుతూ కరపత్రం పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ బాషా, ఎయిర్టెల్ శేఖర్ రెడ్డి, అనంత రామసుబ్బారెడ్డి, భాస్కర్, శేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు. **టిడిపిని ఆశీర్వదించండి:** రానున్న ఎన్నికల్లో టిడిపి పార్టీని ఆశీర్వదించాలని మాజీ జెడ్పిటిసి సభ్యులు చాంద్ బాషా అన్నారు. ఆళ్ళగడ్డ మండలం చింతకొమ్మదిన్నె గ్రామం184 బూత్ లో మాజీ మంత్రి అఖిలమ్మ ఆదేశాల మేరకు గ్రామ సర్పంచు రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో భవిష్యత్తు గ్యారెంటీ బాండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి ప్రభుత్వం వస్తే చేపట్టే ఆరు సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించారు.



చింతకొమ్మదిన్నెలో ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

చాగలమర్రి : రాష్ట్రంలో బ్రిటీష్ పాలన నడుస్తుందని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆరోపించారు. మండలంలోని పెద్దబోధనం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం మాజీ మంత్రి ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న మాజీ మంత్రికి తెదేపా శ్రేణులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. అనంతరం కాలనీల్లో ఇంటింటికి తిరిగి భవిష్యత్తు గ్యారెంటీ పత్రాలను అందజేశారు. ఎస్సీ కాలనీలో కాలనీ వాసులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. వెంటనే స్పందించిన మాజీ మంత్రి తెదేపా అధికారంలోకి రాగానే కాలనీల్లో రహదారులు, ఇతర అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ నరసింహారెడ్డి, టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి గుత్తినరసింహులు, ఐటీడీపీ తాలుకా ఉపాధ్యక్షులు శెగ్నారెడ్డి, తెదేపా నాయకులు కొలిమి ఉసేన్వలి, కొలిమి షరీఫ్, మౌలాలి, హనీష్, నాయకులు ఇన్నారెడ్డి, ఓబులేసు, చంద్రశేఖరరెడ్డి, కుమారరెడ్డి, శాంతయ్య, రమణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న రి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే బీసీ

ప్రజాశక్తి - బనగానపల్లె

ప్రజాశక్తి దినపత్రిక 2024 క్యాలెండర్‌ను శుక్రవారం నాడు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీసీ మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక ప్రజల పక్షాన నిలిచి ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం వార్తలు రాస్తుందన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక వినాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజల పక్షాన నిలిచి, ప్రజల సమస్యలను వార్తల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి విలేకరి జి మద్దయ్య యాదవ్, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, టిడిపి బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ద రాజుపాలెం భూషన్న, యాగంటి పల్లె ఉపసర్పంచ్ బండి మౌళేశ్వర రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాసిం బాబు, నాయకులు పసుపల బాల నాయుడు, లాయర్ నాగేంద్ర రెడ్డి, ఖాదర్ బాషా, పాతపాడు సుంకేశ్వర రెడ్డి వేములపాడు గురప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర ప్రారంభం

ప్రజాశక్తి - పాములపాడు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర పోటీలు శుక్రవారం నాడు మండలంలోని రుద్రవరం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా రుద్రవరం సర్పంచ్ రామస్వామి, స్పెషలాఫీసర్ అనిల్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ ప్రభాకర్ మండలి ఇన్చార్జ్ రాజశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, సుమలత రుద్రవరం డిజిటల్ అసిస్టెంట్ మధు, వాలంటీర్స్, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సర్పంచి తదితరులు

ప్రకృతి వ్యవసాయంతో దిగుబడి అధికం

ప్రజాశక్తి - పగిడ్యాల

ప్రకృతి వ్యవసాయంతో దిగుబడి అధికంగా వస్తుందని పగిడ్యాల సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న అన్నారు. శుక్రవారం పగిడ్యాల గ్రామానికి సమీపాన ఉన్న పగడం వెంకటేశ్వర్లు తన పొలంలో ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటను సర్పంచ్ శేషన్న పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన పంటలు అధిక దిగుబడులు వస్తున్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడులు తగ్గి అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసా యంతో పంటలు సాగు చేస్తే మంచి దిగుబడి వచ్చి అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి రైతుకు ప్రకృతి వ్యవసాయం గురించి అవగాహన కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పొలం యజమాని పగడం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటను పరిశీలిస్తున్న సర్పంచ్ శేషన్న

కాస్ట్ నో కాస్ట్ శిక్షణ సైన్స్ ఉపాధ్యాయులకు ఉపయోగం

ప్రజాశక్తి - బనగానపల్లె

కాస్ట్ నో కాస్ట్ శిక్షణ సైన్స్ ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగమే ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీచర్స్ కాంప్లెక్స్ సమావేశంలో అగస్త్య ఫౌండేషన్ వారి సహకారంతో ఉపాధ్యాయులకు కాస్ట్ నో కాస్ట్ పైన ఆక్టివిటీస్ గురించి ట్రైనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న విషయాలను విద్యా ర్థులకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగస్త్య ఫౌండేషన్ సభ్యు లు వెంకట రాముడు, సంగమేశ్వర్, వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శశాంక్ మృతికి పలువురి నివాళి

ప్రజాశక్తి - బేతంచర్ల

ప్యాపిలి మండలం రోడ్డు ప్రమాదంలో మరణించిన బేతంచర్ల దుర్గాపేట కాలనీ వాసి అయినా పిక్కిలేనిపల్లి నీలకంఠం, లక్ష్మీదేవిల కుమారుడు పి సాయి శశాంక్ మృతికి బేతంచర్ల మండల పరిషత్ అధ్యక్షుడు బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువకుడైన నీలకంఠ కుమారుడు శశాంక్ ప్రమాదంలో మరణించడం బాధాకరమని వారు ఆ కుటుంబానికి సంతాపం తెలి యజేశారు. వారు మాట్లాడుతూ మూర్తిని కుటుంబాన్ని తప్పకుండా ఆదుకుంటామని సభ్యులకు హామీ ఇచ్చారు.

234 గ్రామాల్లో సమగ్ర రీ సర్వే : జెసి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకం కింద 234 గ్రామాల్లో సమగ్ర రీ సర్వే జరిపి భూ హక్కు పత్రాలను సంబంధిత రైతులకు అందజేశామని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడతలో 11 గ్రామాల్లోని 15,670 ఎకరాల విస్తీర్ణంలో సమగ్ర రీ సర్వే, గ్రౌండ్ ట్రూథింగ్ పనులు నిర్వహించి 19,155 సరిహద్దు రాళ్ళను పాతామన్నారు. ఇందుకోసం 88 మంది విలేజ్ సర్వేయర్లను 25 రోవర్సలను వినియోగించామన్నారు. అలాగే రెండవ విడతలో 73 గ్రామాల్లోని 1,53,998 ఎకరాల విస్తీర్ణంలో సమగ్ర రీ సర్వే, గ్రౌండ్ ట్రూథింగ్ పనులు నిర్వహించి 87,855 సరిహద్దు రాళ్ళను నిర్మించామన్నారు. ఇందుకోసం 250 మంది విలేజ్ సర్వేయర్లను 77 రోవర్సలను వినియోగించడం జరిగిందన్నారు. మూడవ విడతలో 150 గ్రామాల్లోని 5,54,001 ఎకరాల విస్తీర్ణంలో సమగ్ర రీ సర్వే, గ్రౌండ్ ట్రూథింగ్ పనులు నిర్వహించి ఇప్పటివరకు 13,794 సరిహద్దు రాళ్ళను పాతామన్నారు. స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందన్నారు. ఇందుకోసం 350 మంది విలేజ్ సర్వేయర్లను 124 రోవర్లను వినియోగించి పెండింగ్ లో ఉన్న పనులు వేగవంతం చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ వివరించారు. భూ యజమానులు భూమి కొలతల అసమతుల్యతపై అభ్యంతరాలను ఏడాదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చని జాయింట్ కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గిరిజనులు స్వయం సమృద్ధి సాధించాలి



ప్రజాశక్తి - రుద్రవరం

అటవీ ఆధారిత చెంచు గిరిజనులు స్వయం సమృద్ధిని సాధించాలని, అందుకు కుట్టు మిషన్లు ఎంతో ఉపయోగపడతాయని నంద్యాల జిల్లా ఫారెస్ట్ అధికారి వినీత్ కుమార్, రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు తెలిపారు. శుక్రవారం రుద్రవరం అటవీ రేంజ్ పరిధిలోని అహెూబిలం గ్రామంలో చెంచు గిరిజనులకుజీవన విధానంలో మార్పులు తేవడానికి ఫారెస్ట్ శాఖ తరపున 10 కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవులు అభివృద్ధి చెందాలంటే అటవీ ఆధారిత చెంచు గిరిజనులకు జీవనోపాదులు మెరుగుదల కోసం కుట్టు మిషన్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ మిషన్లతో వారు అడవిపై ఆధారపడకుండా స్వయం సమృద్ధిని సాధించుకోవాలన్నారు. అడవుల్లో జరిగే నేరాలను, అగ్ని ప్రమాదాలను, నివారించుటలో ఫారెస్ట్ సిబ్బందికి సహాయ సహకారాలు అందించా లన్నారు. ఈ కార్యక్రమంలో అహెూబిలం డిప్యూటీ రేంజ్ అధికారి ముర్తు జావలి, ఆలమూరుఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ముక్తార్ బాష, బీట్ ఆఫీసర్లు విజయవర్ధన్, పలువురు ఫారెస్ట్ సిబ్బంది చెంచులు పాల్గొన్నారు.

యువతకు క్రీడలు ఎంతో అవసరం : చైర్మన్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి-డోన్

ప్రతిభ ఉన్న యువతకు క్రీడలు ఎంతో అవసరమని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. శుక్రవారం డోన్ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హైస్కూల్ నందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ మాట్లా డుతూ ఏపీలో సీఎం వైయస్ జగన్ ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరిట క్రీడా సంబరాలు నిర్వహించడం సంతోషకరమని,గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసే ఈ పోటీలతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ క్రీడా జాబితాను అనుసరించి పురుషులు,మహిళల కబడ్డీ జట్టు పోటీలను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఎంఈఓ ప్రభాకర్,కౌన్సిలర్లు,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వంశీకృష్ణ, వ్యాయమ ఉపాధ్యాయులు,మున్సిపల్ సిబ్బంది,సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ. 20 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి - రుద్రవరం




రోడ్డు నిర్మాణ పనులు చేయిస్తున్న సర్పంచులు, నాయకులు

మండలంలోని బీరవోలు ఎల్లవత్తుల గ్రామాల్లో రూ20 లక్షల గడపగడప నిధులతో సిసి రోడ్ల నిర్మాణం పనులు జరుగుతున్నాయి. శుక్రవారం బీరవోలు సర్పంచ్ ఎలిసా, కోటకొండ గ్రామ సర్పంచ్ డే గాని వెంకటేష్, వైసిపి నాయకులు శేషన్న, రాజ్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గడప, గడప కార్యక్రమంలో భాగంగా రెండు గ్రామాల్లో తిరుగుతున్న సందర్భంగా ప్రజలు సిసి రోడ్లు వేయాలని ఆయనను కోరగా స్పందించిన ఎమ్మెల్యే ఎల్లవత్తుల గ్రామంలో రూ 13 లక్షల నిధులతో 250 మీటర్లు, బీరవోలు గ్రామంలో రూ7 లక్షల నిధులతో 150 మీటర్ల పొడవున రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారన్నారు. దీంతో రోడ్డు నిర్మాణ పనులను మొదలు పెట్టడం జరిగిందన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎక్కల దేవి చంద్రమౌళి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్



నూతన క్యాలెండర్ 2024 ను ఆవిష్కరించిన ఎక్కల దేవి చంద్రమౌళి

ప్రజాశక్తి నూతన క్యాలెండర్ 2024ను శుక్రవారం నందికొట్కూరు నియోజకవర్గ వైసిపి యువ నాయకులు ఎక్కల దేవి చంద్రమౌళి కర్నూల్ లోని తన ఆఫీసు నందు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎక్కల దేవి చంద్రమౌళి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో మంచి ఆదరణ పొందిన ప్రముఖ పత్రిక ప్రజాశక్తి దినపత్రిక అని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచే దినపత్రిక, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చే దినపత్రిక ప్రజాశక్తి , ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేలా పత్రికలు సమాజంలో నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ప్రజాశక్తి మిషన్ సెక్షన్ ఇంచార్జ్ మంగయ్య, నందికొట్కూర్ ప్రజాశక్తి రిపోర్టర్ డి.వి. నాయక్ తదితరులు పాల్గొన్నారు.

250 మంది టిడిపిని వీడి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి సమక్షంలో చేరుతున్న నాయకులు

నంద్యాల పట్టణం వైఎస్సార్ నగర్, నందమూరినగర్ ప్రాంతాలలోని ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన యువత రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై టీడీపీని వీడి వైసిపిలో చేరడం సంతోషంగా ఉందని నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యే ఆద్వర్యంలో నాగరాజునాయక్, దీపక్ నాయక్ ఆద్వర్యంలో వారి కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమా నులు, మహిళలు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి ఎమ్మెల్యే కండు వాలు కప్పి స్వాగతం పలికారు. పార్టీ భలోపేతానికి కృషిచేయాలని వారిని ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల పట్టణం వైఎస్ నగర్, నందమూరి నగర్ ప్రాంతానికి చెందిన నాగరాజునాయక్, దీపక్ నాయక్ వారి కుటుంబ సభ్యులు, మిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులు వైఎస్సార్సీపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. వీరంతా గతంలో టీడీపీలో ఉంటూ పార్టీకి పనిచేశారని, అయితే వీరిని టీడీపీ విస్మరించడంతో విసుగుచెంది పార్టీని వీడటం జరిగిందన్నారు. ప్రధానంగా యువత జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో తమ భవిషత్తు ఉందని గ్రహించారని, జగనన్నకు, శిల్పాకుటుంబానికి తమ మద్దతు ఉంటుందని తెలియజేయడం సంతోషంగా ఉందన్నారు. మొట్టమొదటిసారిగా యువతకు ఓటు హక్కు రావడం వారు భవిషత్తు ఉన్న వైసిపిలో చేరడం శుభపరిణామం అన్నారు. అలాగే శనివారం నంద్యాలలో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు జయప్రకాష్ రెడ్డి, 38వ వార్డు ఇంచార్జ్ టివి రమణ, అప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, కౌన్సిలర్ మేసా చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ లక్ష్మి, హెచ్ఎం సుబ్బరాయుడు తదితరులు

ప్రజాశక్తి - రుద్రవరం

యుటిఎఫ్ - 2024 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని శుక్రవారం ఆవిష్కరించారు. రుద్రవరంలోని కన్యక పరమేశ్వరి ఉన్నత పాఠశాలలో మండల ఎంఈఓ- 2 లక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బరాయుడు యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఐజయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం యుటిఎఫ్ యూనియన్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు రామకృష్ణారెడ్డి, గఫూర్ సాహెబ్, రాజశేఖర్, సుభాన్, నవీన్, నారాయణ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **చాగలమర్రి**: స్థాక ఎంఆర్సి భవనము నందు యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ లను ఎంఈఓ న్యామతుల్లా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ఆడిట్ నెంబర్ డెన్ని జాన్సన్ మాట్లాడుతూ యుటిఎఫ్ సంఘం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. జిల్లా కౌన్సిలర్ బాలస్వామి, మహమ్మద్ గౌస్, శంకర్ గౌస్, అహమ్మద్ పాల్గొన్నారు.



డైరీ, క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ న్యామతుల్లా

ఉరితాళ్ళతో మున్సిపల్ కార్మికుల నిరసన

5వ పేజీ తరువాయి.. **ఆత్మకూరు:** మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, గొడుగురాజు, జోసెఫ్, పెద్ద నాగరాజులు డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం దగ్గర 4వ రోజు మున్సిపల్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్, గౌడు సెంటర్, బస్టాండ్, తహసిల్దార్ కార్యాలయం మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికలకు ముందు అసెంబ్లీ లోను, బయట పాదయాత్రలోను మున్సిపల్ కాంటాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ అధికారంలోకి రాగానే 6 నెలలో పర్మెంటు చేస్తానని, సమాన పనికి సమాన వేతం చెల్లిస్తామని, పర్మినెంట్ సిబ్బందికి సిపిఎస్ ను వారం రోజుల్లోనే రద్దు చేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 5 సంవత్సరాలు పూర్తి కావస్తున్న ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తిమ య్య, నాగన్న, మోహన్, సురేష్, దానమయ్య, రవి, రూతమ్మ, జీవరత్నమ్మ, మణెమ్మ, సుగుణమ్మ, కుమారి, సుశీలమ్మ, తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు పట్టణంలో** మున్సిపాలిటీ కార్మికులు ఉరి తాళ్లతో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్య క్షుడు ఎం నాగేశ్వరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి టి గోపాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల డిమాండ్లకు స్పష్టమైన సమాధానం ఇవ్వడంలే దన్నారు. సమాన పనికి సమాన వేతనం, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ రిస్క్ అలవెన్సులు, క్లాప్ డ్రైవర్లకు రూ. 18,500 వేతనాలు పెంపు తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. రైతు సంఘం మండల కార్యదర్శి బేస్తరాజు, సిఐటియు నాయకులు నాగన్న, ఆంజనేయులు, మున్సిపల్ వర్కర్ సీనియర్ నాయకులు పరమేష్, శ్రీను నాగేశ్వరరావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



నందికొట్కూరులో నిరసన చేస్తున్న ఉరితాళ్ళతో కార్మికులు



కేసీ కెనాల్ లో నీటి లభ్యతపై రైతులతో మాట్లాడుతున్న ఈ ఈ తిరుమలేశ్ రెడ్డి

కేసి కెనాల్‌పై ఆధారపడి వరి సాగు తగదు : ఇఇ

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని రైతు సోదరులు కర్నూలు కడప కెనాల్‌పై ఆధారపడి రబీ సీజన్లో వరి మల్లు సాగు చేయడం తగదని కేసీ కెనాల్ ఈఈ తిరుమలేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం వ్యవసాయ అధికారులు అధికారుల తో కలిసి బండి ఆత్మకూర్ సంత జూటూరు భోజనం పరమటూరు గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. రిజర్వాయర్లలో నీటి లభ్యత తక్కువగా ఉండటం వల్ల తాగునీటికి మాత్రమే వాటిని వినియోగించుకోవడం జరుగుతుందని రైతు సోదరులు కేసీ కెనాల్‌పై పంపుసెట్ల ద్వారా వ్యవసాయం చేయాలనుకోవడం సాధ్యం కాదన్నారు. అంతే కాకుండా బోరు బావులు బావులు ఉన్న రైతులు ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని వ్యవసాయ శాఖ సిబ్బంది చెబుతున్న అనేకమంది రైతులు వరి పంటను సాగు చేయడం సరికాదన్నారు. నీటిని పంపుసెట్ల ద్వారా తీసుకోవడం తగదని తాగునీటి అవసరాల కోసం మాత్రమే నీటిని విడుదల చేస్తున్నామని ఆయన తెలిపారు. ఇప్పటికైనా రైతు సోదరులు రిజర్వాయర్ల నీటి లభ్యతను గురించి ఆలోచించి వరి మాగాణి సాగు చేయడం మానుకోవాలని అభ్యర్థించారు. కార్య క్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, కెసి కెనాల్ అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితంగా నల్లమల

- చలమరెంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ ఈశ్వరయ్య

ప్రజాశక్తి - మహానంది



ప్లాస్టిక్ రహితంగా నల్లమల అటవీని చేసేందుకు జనవరి ఒకటవ తేదీ నుంచి నల్లమలలో ప్రాంతంలో ప్లాస్టిక్ వస్తువులను అనుమతించడం లేదని చలమరెంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ ఈశ్వరయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ప్లాస్టిక్ వినియోగించకుండా ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణకై తమ వంతు బాధ్యతగా వ్యవహరిస్తూ, వన్యప్రాణులు ప్లాస్టిక్ వస్తువులు తిని అనారోగ్యం పాలై మృతి చెందకుండా, భూ కాలుష్యాన్ని తగ్గించి, అటవీ, సంరక్షణలో తమ వంతు పాత్ర పోషించాలని కోరారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

నూతన సంవత్సర వేడుకలకు దూరం : మాజీ ఎమ్మెల్యే బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాటా డుతూ నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉంటున్నామని, టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు తనకోసం రావొద్దని తెలిపారు. బనగానపల్లె నియోజకవర్గ ప్రజలకు ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నానని, నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు. పట్టణ మాజీ సర్పంచ్, మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సోదరుడు బిసి రాజారెడ్డి నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు తెలిపారు. వ్యక్తిగత కారణాలవల్ల తన అందుబాటులో ఉండడం లేదని తెలిపారు.

మహారాజశ్రీ నందికొట్కూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఒ.ఎస్. నెంబర్ 125/2022

బోయ మండ్ల వెంకటలక్ష్మి. ...వాది

వర్సెస్

బోయ మండల జయరాముడు తండ్రి వెంకట రాముడు హిందూ, వయస్సు 40 సంవత్సరాలు, వ్యాపారం రామాపురం గ్రామం, అవుకు మండలం, నంద్యాల జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

వాది తన ప్రాపర్టీ విషయమై ప్రతివాది పైన పైకోర్టులో పై నెంబరు గల దావాను దాఖలు చేసి యున్నది. సదరు దావా నందు కోర్టు వారి ప్రతివాది పంపిన దావా సమన్లను తీసుకోనకుండా ఉన్నందున ఇందుమూలముగా ప్రతివాదికి తెలియజేయడం ఏమనగా 05-01-2024 తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై నీకున్న ఆక్షేపణలు తెలుపవలెను. లేని ఎడల నీకు పరోక్షముగా తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)

వాయిదా 05-01-2024

కె.భాస్కర్,
వాదిపరం న్యాయవాది,
నందికొట్కూరు

మహారాజశ్రీ నందికొట్కూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో వైఎస్ నెంబర్ 299/2022

మిద్దూరు మూలమ్మ @ ఆఫ్ మిద్దూరు లక్ష్మీదేవి ...వాది

వర్సెస్

మిద్దూరు రాజేష్ తండ్రి మిద్దూరు వెంకటేశ్వర్లు హిందూ, వయస్సు 25 సంవత్సరాలు, ఇంటి నెంబర్ 1-81, మిట్ట కందాల గ్రామం, పాములపాడు మండలం, నంద్యాల జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

వాది తన ప్రాపర్టీ విషమై ప్రతివాది పైన పై కోర్టులో పై నెంబరు దావ దాఖలు చేసి ఉన్నది. సదరు దావా నందు కోర్టువారు ప్రతివాదికి పంపిన దావా సమన్లు తీసుకొనకుండా తప్పించుకున్నదున ఇందు మూలముగా ప్రతివాదికి తెలియజేయడం ఏమనగా 05-01-2024 తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై నీకున్న ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల దావాను మీ పరోక్షంగా తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)

వాయిదా 05-01-2024

కె.భాస్కర్,
వాదిపరం న్యాయవాది,
నందికొట్కూరు

మహారాజశ్రీ నందికొట్కూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెంబర్ :431/2022 ఓ.ఎస్ నెంబర్ 125/ 2022

బోయ మండల వెంకటలక్ష్మి. ...పిటిషనర్

వర్సెస్

బోయ మండల జయరాముడు తండ్రి వెంకటరాముడు, హిందూ, వయస్సు 40 సంవత్సరాలు, వ్యాపారం, రామాపురం గ్రామం, అవుకు మండలం నంద్యాల జిల్లా. ...రెస్పాండెంట్

రెస్పాండెంట్ కు దావా నోటీసులు

పిటిషనర్ ప్రాపర్టీ విషయమై రెస్పాండెంట్ మీద పై కోర్టులో దావా దాఖలు చేసియున్నది. సదరు దావా నందు కోర్టువారు రెస్పాండెంట్‌కు పంపిన నోటీసులను తీసుకోకుండా తప్పించుకున్నందున ఇందు మూలముగా రెస్పాండెంట్ కు తెలియ జేయడం ఏమనగా 05-01-2024 తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని వకీల్ ద్వారాగాని హాజరై నీకున్న ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల దావాను మీకు పరోక్షముగా తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)

వాయిదా 05-01-2024

కె.భాస్కర్,
పిటిషనర్స్ పరం న్యాయవాది,
నందికొట్కూరు.

సమను వాయిదా ప్రకటన
మహారాజశ్రీ నంద్యాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.ఎస్ నెంబర్ 1158/2019

గుండి శేఖర్. ...వాది

వర్సెస్

మేరువ నాగేశ్వరరెడ్డి తండ్రి సుబ్బారెడ్డి, బీరవోలు గ్రామం, రుద్రవరం మండలం, నంద్యాల జిల్లా. ...ప్రతివాది

పై నెంబరు దావాలోని వాది ప్రతివాది వద్ద నుంచి దావ మొత్తము 44,400/- రాగోరి దావా దాఖలు చేయగా దావాలో ప్రతివాదికి దావా సమన్లకు గాను 11/01/2024వ తేదీకి వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు ప్రతివాదికి ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టుకు పై తేదీన ఉదయం 10:30 గంటలకు హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల పరోక్షమున తీర్మానించ బడును

వాయిదా తేదీ : 11/01/2024

శ్రీ చేపూరి మద్దిలేటి,
BABL
వాదిపురం అద్వకేట్,
నంద్యాల 518501

సమాజ సేవలో.. అంగన్వాడీలు మరో మదర్ థెరిస్సాలు



నంద్యాల రూరల్: అంగన్వాడిల సమ్మెకు ఏపీడబ్ల్యూజేఎఫ్ సంఘీభావం



పాములపాడు : మాట్లాడుతున్న నాయకులు



అంగన్వాడీలకు మద్దతు తెలుపుతున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

5వ పేజీ తరువాయి.. **బేతంచెర్ల :** అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు జి శేభ రాణి ఆధ్వర్యంలో బేతంచర్ల పాత బస్టాండ్ భారత్ బేకరీ సర్కిల్ నందు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మధు శేఖర్, ప్రజా సంఘాలు సంఘీభావం తెలియజేస్తూ మద్దతు పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు ప్రభుత్వ స్పందించి వారికి సాధ్యమైనంత త్వరగా న్యాయం చేస్తే మంచిదని లేదంటే సమ్మెను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి, వెంకటలక్ష్మి సరోజ ఎల్లమ్మ రమణమ్మ సుజాత సులోచన లక్ష్మీపార్వతి, సంతోష కళావతి, మల్లేశ్వరి రాధాదేవి, నారాయణమ్మ, అంజలీదేవి, మద్దమ్మ శివలక్ష్మి, సుమతి, తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** అంగన్వాడీలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి మంజుల, నాయకురాలు లక్ష్మీదేవి, ప్రమీలమ్మ, సిఐటియు పట్టణ అధ్యక్షులు రజాక్, కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్‌లు అన్నారు. పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెను కొనసాగించారు. యూనియన్ నాయకురాలు సుధారాణి, వెంకటలక్ష్మి, లక్ష్మి, ప్రియాంక, ప్రమీల, రవణమ్మ, అరుణ, విజయలక్ష్మి, లక్ష్మీదేవి, చెన్నమ్మ, సుజాత, సిఐటియు నాయకులు సురేంద్ర, ఇస్మాయిల్, సుధాకర్, దినేష్, గణపతి, మోహన్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు. **మున్సిపల్ కార్మికుల మద్దతు :** అంగన్వాడీలకు రోజు ఒక కొత్త యాప్‌ను తీసుకొచ్చి పని భారం పెంచుతున్నారని, పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని, వారి డిమాండ్లను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, గొడుగురాజు, జోసెఫ్, పెద్ద నాగరాజు, మున్సిపల్ కార్మికులు మద్దతు తెలిపారు. **బనగానపల్లె :** అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు చేస్తున్న నిరవధిక సమ్మెకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సంఘీభావం తెలిపారు. బనగానపల్లె పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు చేస్తున్న నిరవధిక సమ్మెకు ఏపిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ మద్దయ్య యాదవ్, నియో జకవర్గ ఉపాధ్యక్షులు ఆంధ్ర అక్షర రామచంద్రారెడ్డి, సూర్య నరసింహారెడ్డి, మండల గౌరవ అధ్యక్షులు రఘురామిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు నేను సైతం మధు, సీనియర్ జర్నలిస్టులు ఆంధ్రజ్యోతి వెంకటేశ్వర్లు, ఈనాడు వెంకట రాముడు, నగేష్, 10టీవీ శ్రీకాంత్, విశ్వ జ్యోతి రిపోర్టర్ వెంకటరాముడు మా వారధి బాలయ్యలు సంఘీభావం తెలిపి మాట్లాడారు. మద్దయ్య యాదవ్ మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు డివిజన్ కార్యదర్శి జే వి సుబ్బయ్య, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి రోజా రమణి, సభ్యులు రమాదేవి వరలక్ష్మి, శశికళ, మల్లేశ్వరి, రమణమ్మ, ప్రసన్న, మహేశ్వరి, సరస్వతి అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. **పాములపాడు :** అంగన్వాడీల జీతాలను ప్రభుత్వం పెంచి వారి సమ్మెను విరమింపజేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సీనియర్ నాయకులు బి రామేశ్వరరావు డిమాండ్ చేశారు. అంగన్వాడీ టీచర్ల సమ్మెకు ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. దీక్షలో స్వర్ణకుమారి ,హేమలత, ఉషారాణి, నాగమణి, రవణమ్మ, రమాదేవి, తొలిషమ్మ, చెన్నమ్మ ,దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సామన్న, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, వ్యకాసం నాయకులు ఎస్ ఆర్ రమణ, ఏసేపు, నాయకులు బాల యేసు, అంజలి, కళాకారులు పురుషోత్తం, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు శివలక్ష్మి, నాగమద్దమ్మ, రమణ బాయ్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్లలో** యూనియన్ నాయకులు పద్మావతి, భాగ్యలక్ష్మి, శ్రీదేవి, ప్రభావతిల ఆధ్వర్యంలో అంగన్వాడీలు భజన చేస్తూ పాటలతో నిరసన చేశారు. స్థానిక ఎమ్మార్వో కార్యాలయం దగ్గర దీక్షా శిబిరంలో నిరసనదీక్షలు చేశారు. సిఐటియు జిల్లా నాయకుడు పి దావీదు మాట్లాడుతూ అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడం అన్యాయమని, ఉద్య మాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. **మిడుతూరు :** అంగన్వాడీ యూనియన్ నాయకులు లక్ష్మి కుమారి అధ్యక్షతన అంగన్వాడీలు నిరసనలు తెలిపారు. సిఐటియు జిల్లా నాయకురాలు జి. నాగమణి, సిఐటియు మండల నాయకులు వెంకటశివుడు, లింగస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు ఓబులేసు వారు మాట్లాడుతూ న్యాయమైన సమస్య లను పరిష్కరించాలని కోరారు. **పాణ్యంలో** అంగన్వాడీల సమ్మెకు సిఐటియు మండల కార్యదర్శి కె భాస్కర్, మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షులు దత్తు హాజరై సంఘీభావం తెలిపారు. అంగన్వాడీల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. యూనియన్ మండల నాయకురాలు వెంకటమ్మ, మాబునిస, శ్యామల, మరియమ్మ, ఆయాలు పాల్గొన్నారు. **పగిడ్యాల :** తహశీల్దార్ కార్యా లయం ఆవరణలో అంగన్వాడీలు రిలే నిరాహార దీక్షలను కొనసాగించగా సిఐ టియు జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమం లో సాజిదాబి, ఖుషిద్ బి, వరలక్ష్మి, పద్మావతి, ప్రభావతమ్మ, భాస్కరమణి, నారాయణమ్మ, స్వర్ణలత, నాగమణి, హైమావతి తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు పట్టణంలో** ఐసిడిఎస్ కార్యాలయం ముందు యూనియన్ నాయకు రాలు మదర్ ది అధ్యక్షతన అంగన్వాడీలు సమ్మెను కొనసా గించారు. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు నిరవధిక సమ్మె ను కొనసాగిస్తామని వారు తెలిపారు. **బండి ఆత్మకూర్:** బండి ఆత్మ కూరు మండల కేంద్రంలో ర్యాలీ చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా నాయకులు రత్నమ య్య, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు వెంకటసుబ్బన్న మాదిగ, వ్యకాసం నాయకులు డేవిడ్, రామచంద్రుడు పాల్గొని మాట్లాడారు.

అంగన్వాడీలకు అండగా ఉంటాం : భూమా అఖిలప్రియ

చాగలమర్రి: అంగన్వాడీ కార్యకర్తలు సహాయకులకు తెలుగుదేశం పార్టీ మద్దతు ఉంటుందని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. స్థానిక కేరళ ఆసుపత్రి ఎదురుగా అంబేద్కర్ సర్కిల్లో గత 17 రోజుల నుంచి సిఐటియు ఎఐటియుసి సంఘాల ఆధ్వర్యంలో నిరవధిక నిరసన దీక్షలకు భూమా అఖిలప్రియ మద్దతు తెలిపి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు సహాయకులకు తాము ఎప్పుడూ మద్దతు ఉంటామన్నారు. జగన్ ప్రభుత్వము అంగన్వాడీల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, టిడిపి నాయకులు కొలిమి మా బు షరీఫ్, మౌలాలి , గుత్తి నరసింహులు ముల్లా గఫర్ ,ముల్లా అజీమ్, హనీఫ్ జెట్టి నాగరాజు ,బషీర్, ఆకుల ఇర్షాద్, నాగూర్, రమేష్, కొలిమి హుస్సేన్ పీరా సలీం సాదాబ్ తదితరులు పాల్గొన్నారు.

భూ హద్దుల కొలతలపై ఏడాదిలోపు దరఖాస్తు చేసుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో మూడవ విడతలో చేపట్టిన రీ సర్వే ప్రక్రియ పనులను పకడ్బందీగా చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ సంబంధిత మండలాల తాసిల్దార్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రీ సర్వే, ఆర్ఓఆర్, మ్యుటేషన్ సేవలు, భూ సేకరణ, పరాయికరణ, వ్యవసాయ భూముల కేటాయింపు తదితర నిర్దేశిత రెవెన్యూ లక్ష్యాల సాధనపై జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే మూడవ విడత కార్యక్రమాన్ని వేగవంతం చేసి ఈనెల 15వ తేదీలోగా ఫైనల్ ఆర్ఓఆర్ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తాసిల్దార్లను ఆదేశించారు. స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ పూర్తయి సర్వే నంబర్లలోని కొలతల్లో తేడాలొస్తే సంబంధిత భూ యజమానులు ఏడాది లోపు దరఖాస్తులు సమర్పించుకొనేలా రైతుల్లో భరోసా కల్పించాలని కలెక్టర్ మండల తాసిల్దార్లను ఆదేశించారు. భూ హద్దుల కొలతల పై చిన్నచిన్న అభ్యంతరాలు వ్యక్తం చేస్తే వాటిని పరిష్కరించే దిశలో తాసిల్దార్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. రీ సర్వే ప్రక్రియకు సంబంధించి గ్రౌండ్ టూథింగ్, ఫైనల్ ఆర్ఓఆర్, స్టోన్ ప్లాంటేషన్ పై రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించుకొని పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియపై సిసిఎల్ఎ నుంచి ప్రతిరోజు సమీక్షిస్తున్నారని ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు ఆర్డీవోలు, తాసిల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన తరహాలోనే రీ సర్వే పై వచ్చిన గ్రీవెన్స్ స్ ను కూడా రిజిస్టర్లో నమోదు చేసి 15 రోజుల్లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మ్యుటేషన్ దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఎ లోకి వెళ్లకుండా చూసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన రెవిన్యూ అంశాలను కాల పరిమితి లోపు పరిష్కరించేందుకు అంకితభావంతో పనిచేయాలని అన్ని మండలాల తాసిల్దారులను ఆదేశించారు. ఈ సమావేశంలో లో డిఆర్ఓ పుల్లయ్య, ఏడి సర్వే లాండ్స్,సంబంధిత డివిజన్, ఆర్డీవోలు, తాసీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్లు పాల్గొన్నారు.